


ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు (విద్య): ఉపాధ్యాయ దినోత్సవం నాడు అందించే రాష్ట్ర, జిల్లాస్థాయి ఉపాధ్యాయ అవార్డుల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు విద్యాశాఖ ఏడీ గ్లోరీకుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు 2024 సంవత్సరానికి రాష్ట్ర, జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు ఈనెల 10వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు డిప్యూటీ ఈవో, ఎంఈవోల ద్వారా దరఖాస్తులను డీఈవో కార్యాలయంలో అందచేయాలన్నారు. గడువు దాటిన తరువాత వచ్చిన ప్రతిపాదనలను స్వీకరించబోమన్నారు. పూర్తి సమచారం కోసం విద్యాశాఖ కార్యాలయంలోనూ లేదా www.deo.nellore.50 web.comను సంప్రదించాలని తెలిపారు.

ఈ ఫొటోలు చూశారా!? ఇదేదో ఎండిపోయిన చెరువనో లేదా నీటివనరు కోసం జరుపుతున్న తవ్వకాలనో.. అనుకుంటే పొరబడ్డట్టే. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో మట్టి మాఫియా దోపిడీకి నిలువెత్తు నిదర్శనమే ఈ చిత్రాలు. అధికారం చేతిలో ఉందికదా అని కావలి ప్రాంతంలో అక్రమార్కులు రెచ్చిపోయారు. అక్రమ లేఅవుట్లు, భూ ఆక్రమణలు, ఇసుక, గ్రావెల్ ఇలా అక్రమార్జనకు కాదేదీ అనర్హం అన్నట్టుగా వైసీపీ నాయకులు వ్యవహరించారు. వీరి ధనదాహానికి కొండలు సైతం కరిగిపోయాయంటే దోపిడీ ఎలా జరిగిందో అర్థం చేసుకోవచ్చు. బోగోలు మండలంలో సాక్షాత్తు రెవెన్యూ, పోలీసు కార్యాలయాల చుట్టూనే భారీ యంత్రాల సాయంతో గ్రావెల్‌ను తవ్వి తరలించారు. ఇందుకు నిదర్శనంగా ఇప్పటికీ అక్కడ నిలువెత్తు గుంతలు దర్శనం ఇస్తు న్నాయి. ఈస్థాయిలో మట్టిమా ఫియా రెచ్చిపోయినా అప్పట్లో కళ్లుండి కూడా అధికారులు ఏం చేయలేని నిస్సహాయస్థితిలో ఉండిపోయారు. అయితే, ఇప్పుడు ఎన్డీఏ ప్రభుత్వం అధికారం చేపట్టినా అక్రమార్కులపై చర్యలు తీసుకునేందుకు సాహసించలేకపోతున్నారు.





తిప్ప పోలీస్‌స్టేషన్‌కు వెనుక అసైన్‌మెంట్ స్థలంలో తవ్విన గ్రావెల్ గుంతలు



బోగోలు తహసీల్దార్ కార్యాలయం వెనుక..

గుంతలు ఇవీ..
గంతలు విప్పండి!

- వైసీపీ హయాంలో కరిగిపోయిన సహజ వనరులు
- బోగోలులో ఇష్టానుసారంగా గ్రావెల్ తవ్వకాలు
- నేతల ఒత్తిళ్లతో అధికారుల మౌనం
- ప్రభుత్వం మారినా తీరుమారదే!
- అక్రమార్కులపై చర్యలకు మీనమేషాలు

ఆంధ్రజ్యోతి పరిశీలన

కావలి/బిట్రగుంట, ఆగస్టు 1: వైసీపీ ప్రభుత్వంలో బోగోలు మండలంలో కోట్లాది రూపాయల సహజ వనరులు దోపిడీ చేసినా అప్పటి అధికారులు అధికార పార్టీకి భయపడి దోపిడీదారులకు సహకరించారు. బోగోలు మండలంలో జాతీయ రహదారికి ఇరువైపులా ప్రభుత్వ కార్యాలయాలు, పోలీస్‌స్టేషన్‌ను ఆనుకుని విలువైన సహజ సంపద దోపిడీకి గురైంది. సహజ వనరులు దోపిడీకి గురవుతున్నా అధికార యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరించింది. అయితే రాష్ట్రంలో ప్రభుత్వం మారి ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చినా ప్రభుత్వ స్థలాల్లో అక్రమ గ్రావెల్ తవ్వకందారులపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అక్రమ గ్రావెల్ తవ్వకాలపై అప్పట్లో ప్రతి పక్షంలో ఉన్న టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు ఆందోళనలు చేపట్టినా ఎవరూ పట్టించుకోలేదు. అయితే ఆ మూడు పార్టీల కలయికతో ఏర్పడిన ఎన్డీఏ కూటమి ప్రస్తుతం అధికారంలోకి ఉన్నా వాటిపై ఎందుకు చర్యలు తీసుకోవటంలేదనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

• అధికారుల సాక్షిగా..

వైసీపీ పాలనలో అధికారుల సాక్షిగా అధికార పార్టీ నాయకులు గ్రావెల్‌ను రియల్టర్లకు తరలించి సొమ్ము చేసుకున్నారు. తిప్ప పరిసర ప్రాంతాల్లో రాత్రింబవళ్లు భారీ యంత్రాల ద్వారా తవ్వి టిప్పర్లతో లోడ్‌ల కొద్దీ గ్రావెల్ నెల్లూరుకు తరలించారు. తిప్ప పోలీస్ స్టేషన్‌కు తూర్పు వైపు అసైన్డ్ భూములను కుళ్లబొడిచారు. లబ్ధిదారులను బెదిరంచి దోపిడీకి పాల్పడినా అధికారులు మాత్రం అడ్డుకోలేక పోయారు. అలాగే జాతీయ రహదారికి తూర్పు వైపు ఉన్న గురుకుల పాఠశాల వెనుక కూడా గ్రావెల్ కోసం తవ్వేశారు. జాతీయ రహదారి ఆనుకుని పడమర వైపు ఉన్న ట్రైబల్ ట్రైనింగ్ సెంటర్ భవనాన్ని ఆనుకుని ఉన్న భూములను కుళ్లబొడిచారు. మట్టి కోసం తవ్విన తవ్వకాలకు సాక్ష్యంగా ఇప్పుడున్న గుంతలే ఉంటున్నాయి. ప్రహరీ వెంబడి సుమారు ఆరేడు అడుగుల లోతు వరకు గ్రావెల్ తవ్వి తరలించారు. దీంతో వర్షాలు పడితే గోడపక్కన ఉన్న కొద్దిపాటి మట్టి కరిగి పోతే ఆ భవనం కూలే ప్రమాదం ఉంది. ఈస్థాయిలో అధికార పార్టీ నాయకులు దోపిడీకి పాల్పడితే అధికారులు మాత్రం కళ్లుండి కబోదిలా వ్యవహరించారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అలాగే ఎఫ్‌సీఐ గోదాములకు పడమర వైపు కూడా భారీ గుంతలు దర్శనం ఇస్తున్నాయి. ఈ గుంతలను చూస్తే గ్రావెల్‌ను ఏస్థాయిలో తీసుకువెళ్లారో అర్థమవుతుంది. ఈ గుంతల మూలంగా గోదాముల భవనాలు కూడా ప్రమాదాల బారిన పడే అవకాశం దుపురించింది. మరోవైపు తహసీల్దార్ కార్యాలయం వెనుక కూడా భారీ గుంతలు పెట్టి గ్రావెల్ తరలించారు. ఈ విషయం అప్పట్లో అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఒకరిపై ఒకరు చెప్పుకుని తప్పించుకునే ప్రయత్నాలు చేశారే తప్ప ప్రభుత్వ సొమ్ము దోపిడీ కాకుండా కాపాడాలనే బాధ్యత గుర్తుకు రాకపోవటం బాధాకరం.

• ప్రభుత్వం మారినా...

రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చినా అక్రమ గ్రావెల్ తవ్వకందారులపై చర్యలు తీసుకోవాలనే ఆలోచనలో ఇప్పటి పాలకులు, అధికారులు ఆలోచించడం లేదనే విమర్శలు ఉన్నాయి. కావలిలో ప్రభుత్వ ఆస్తులను ఆక్రమించి వేసిన అక్రమ లేఅవుట్లను అధికారులు సర్వే చేసి బయటకు తీస్తున్నారు. అయితే బోగోలులో మాత్రం అక్రమ గ్రావెల్ తవ్వకందారులపై చర్యలు తీసుకునేందుకు వెనుకాడుతున్నారు. ఇప్పుడున్న గుంతలను సర్వే చేసి ఎంతమేరకు గ్రావెల్ తరలించారో గుర్తించి, అక్రమార్కుల నుంచి పెనాల్టీలు, పన్నులు వసూలు చేసి ప్రభుత్వ ఖజానాకు జమ చేయిస్తే భవిష్యత్తులో అధికారం ఉందని మరొకరు సహజవనరుల దోపిడీకి తెగించరని ప్రజలు కోరుతున్నారు.

ట్రైబల్ ట్రైనింగ్ సెంటర్ భవనం గోడ ఆనుకుని..





కుడితిపాలెంలో దివ్యాంగుడు సుమన్‌కు పెన్షన్ అందజేస్తున్న కలెక్టర్ ఆనంద్

ఎన్టీఆర్ భరోసా పింఛను లబ్ధిదారుల జీవనానికి ఆసరా

- జిల్లా కలెక్టర్ ఆనంద్ వెల్లడి

ఇందుకూరు పేట, ఆగస్టు 1: ఎన్టీఆర్ భరోసా పింఛను లబ్ధిదారులకు ఆసరా అని జిల్లా కలెక్టర్ ఆనంద్ తెలిపారు. మండలంలోని కుడితిపాలెం, ముదివర్తిపాలెం, నిడుముసలి గ్రామాల్లో జిల్లా కలెక్టర్ ఆనంద్ ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేశా రు. గురువారం మండలంలో పర్యటించిన కలెక్టర్ వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు పింఛన్లను అందజేశారు. కలెక్టర్ గ్రామానికి వచ్చి పింఛను అందించడంపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో సాయి లహరి, తహసీల్దారు జగదీష్, సచివాలయ అధికారులు పాల్గొన్నారు.

96.71 శాతం పెన్షన్ల పంపిణీ

నెల్లూరు (హరనాథపురం): జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ గురువారం 96.71 శాతం జరిగింది. మొత్తం 3,11,540 పెన్షన్లకు గాను 3,01,280 పెన్షన్లను పంపిణీ చేశారు. ఇంకా 10,260 మందికి పెన్షన్లను అందజేయాల్సి ఉంది. శుక్రవారం వీరికి పంపిణీ చేయనున్నారు.

59 మందికి షోకాజ్ నోటీసులు

వరికుంటపాడు: నిబంధనలకు విరుద్ధంగా పింఛన్ల పంపిణీలో అలసత్వం ప్రదర్శించిన 59 మంది ఉద్యోగులకు గురువారం ఎంపీడీవో వెంకటకృష్ణ కుమారి షోకాజ్ నోటీసులు అందజేశారు. ఉదయం 6 గంటలకు పంపిణీ ప్రక్రియ ప్రారంభించాలని ఆదేశాలు ఉన్నా ఏమాత్రం పట్టించుకోని సదరు ఉద్యోగులు గంటల తరబడి ఆలస్యంగా పంపిణీని చేపట్టారు. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు క్రమశిక్షణ చర్యల్లో భాగంగా మూడు రోజుల్లో సంజాయిషీ ఇవ్వాలని కోరుతూ 12 సచివాలయాల పరిధిలోని ఉగ్యోగులకు షోకాజ్ నోటీసులు అందజేశారు.

నిషేధిత జాబితాలోకి ప్రభుత్వ భూములు

నెల్లూరు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : నిషేధిత జాబితాలో నుంచి తొలగించి రూ.100 కోట్ల విలువైన ప్రభుత్వ భూములను తిరిగి 22-ఏ జాబితాలోకి చేరుస్తూ కలెక్టర్ ఓ ఆనంద్ ఉత్తర్వులు ఇచ్చారు. దీంతో నెల్లూరు రూరల్ మండలం గుడిపల్లిపాడు రెవెన్యూ పరిధిలోని కోడూరుపాడు వద్దనున్న సర్వే నెం.521, 525, 527, 529-ఏలలోని సుమారు 21 ఎకరాలను నిషేధిత జాబితాలో చేర్చారు. జూలై 13వ తేదీన 'ఎవరు చేశారు.. ఎందుకు చేశారు..?' శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై కలెక్టర్ స్పందించారు. ఈ వ్యవహారంపై పూర్తిస్థాయి నివేదిక అందజేయాలని నెల్లూరు ఆర్డీవో, నెల్లూరు రూరల్ తహసీల్దార్‌ను ఆదేశించారు. అవి ప్రభుత్వ భూములేనని, సుప్రీంకోర్టులో కూడా కేసు నడుస్తోందని ఆర్డీవో, తహసీల్దార్ నివేదించారు. వెంటనే ఆ భూములను తిరిగి 22-ఏ జాబితాలోకి చేర్చాలంటూ ఆదేశించడంతో బుధవారం ఆ ప్రక్రియను రెవెన్యూ అధికారులు పూర్తి చేశారు. దీంతో ప్రభుత్వ భూములను కొట్టేయాలని అక్రమార్కులు వేసిన స్కెచ్ విఫలమైంది. కాగా ప్రభుత్వ భూములను తిరిగి నిషేధిత జాబితాలో చేర్చడం వరకూ బాగుంది కానీ ఈ పని ఎవరు చేశారు? ఎందుకు చేశారు? అన్నది మాత్రం వదిలేశారు. బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటే మరొకరు ఇటువంటి పనులు చేసేందుకు భయపడతారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

రైతుబజార్లలో తక్కువ ధరకు బియ్యం, కందిపప్పు



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్చార్జి జేసీ సూర్యతేజ

నెల్లూరు (హరనాథపురం), ఆగస్టు 1 : రైతు బజార్లలో తక్కువ ధరకే కందిపప్పు, బియ్యంను ప్రజలకు అందజేయనున్నట్లు ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ సూర్యతేజ చెప్పారు. గురువారం తన చాంబర్‌లో రైస్‌మిల్లర్లు, దాల్ మిల్లర్ల అసోసియేషన్ నాయకులతో ఆయన సమావేశమయ్యారు. బహిరంగ మార్కెట్‌లో కందిపప్పు కిలో రూ.181 ఉండగా, రైతు బజార్లు, భారీ సంస్థాగత రిటైల్ దుకాణాల ద్వారా రూ.150కే విక్రయిస్తున్నట్లు తెలిపారు. కేజీ స్టీమ్ బియ్యాన్ని రూ.48లకు, పచ్చి బియ్యం రూ.47లకు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో కందుకూరు సబ్ కలెక్టర్ విద్యాధరి, ఆర్డీఓలు మలోల, శీనానాయక్, మధులత, డీఎస్ఓ వెంకటరమణ, సివిల్ సప్లయిస్ డీఎం నరసింహం తదితరులు పాల్గొన్నారు.

'సోమశిల'కు చేరిన కృష్ణా జలాలు

అనంతసాగరం, ఆగస్టు 1: సోమశిల ప్రాజెక్టు ఎగువ నుంచి కృష్ణా జలాలు గురువారం చేరాయి. ప్రస్తుతం 3వేల క్యూసెక్కుల వరద వస్తుండగా భవిష్యత్తులో మరింత పెరగవచ్చని అధికారులు తెలిపారు. కాగా, జలాశయం పూర్తిసామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా 9.471 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దిగువ డెల్టాకు 200, ఉత్తర, దక్షిణ కాలువలకు 10 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

పిల్లల బడిలో పెద్దల పాలనకు సన్నాహాలు

- పాఠశాలల్లో విడుదలైన నోటిఫికేషన్
- 8న ఎస్ఎంసీ ఎన్నికల నిర్వహణ

నెల్లూరు (విద్య): ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ కమిటీలు (ఎస్ఎంసీ) ఎన్నికల ప్రక్రియకు సంబంధించి గురువారం నోటిఫికేషన్ విడుదలైంది. జిల్లాలోని అన్ని పాఠశాలల్లో ఓటర్ల జాబితాలను నోటీస్ బోర్డుల్లో ఉంచారు. ఈ నెల 5వతేదీ ఉదయం 9 నుంచి 1 గంట వరకు ఓటర్ల జాబితాలపై అభ్యంతరాలు స్వీకరిస్తారు. అదే రోజు సాయంత్రం తుది ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు పరిష్కరించి ఫైనల్ జాబితా విడుదల చేస్తారు. 8వ తేదీ మధ్యాహ్నం వరకు ఎన్నికలు, 3 నుంచి 4 గంటల సమయంలో ఎన్నికైన సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించి తొలి సమావేశాన్ని ఏర్పాటు చేయనున్నారు. ప్రతి పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి ముగ్గురు చొప్పున సభ్యులను ఎన్నుకుంటారు. తరగ తుల వారీగా తల్లిదండ్రులను సమావేశ పరిచి చేతులు ఎత్తే పద్ధతిలో సభ్యులను ఎన్నుకుంటారు. పోటీ తీవ్రంగా ఉంటే రహస్య ఓటింగ్ నిర్వహిస్తారు. అలా ఎన్నికైన సభ్యుల నుంచి ఛైర్మన్, వైస్ ఛైర్మన్‌లను ఎంపిక చేస్తారు. మహిళలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ సామాజిక వర్గాల వారికి కమిటీల్లో ప్రాధాన్యం ఉంటుంది. ఎక్స్‌అఫిషియో సభ్యులుగా పాఠ శాల హెచ్‌ఎంలు ఉంటారు. ఎన్నికల ప్రక్రియ ను విద్యాశాఖ అధికారులతో పాటు ఎంపీడీఓ, తహసీల్దారు కార్యాలయాల అధికారులు పర్యవేక్షి స్తారు. జిల్లాలో ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎన్నికలను పకడ్బందీగా నిర్వహిస్తామని డీఈఓ రామారావు, ఎస్ఎస్ఏ ఏపీసీ ఉషారాణి తెలిపారు.



సీతారాపురంలో ఓటర్ల జాబితాను ప్రదర్శిస్తున్న ఉపాధ్యాయులు

సమస్యలన్నీ పరిష్కరిస్తా!

- ఎవరూ ఆందోళన చెందొద్దు!
- ప్రత్యేక పరిష్కార వేదికలో మంత్రి నారాయణ
- కార్పొరేషన్‌లో సాయంత్రం వరకు అర్జీల స్వీకరణ

నెల్లూరు(సిటీ), ఆగస్టు 1 : 'ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరంలేదు. ప్రశాంతంగా కూర్చోండి. నేనే మీవద్దకు వచ్చా. మీ సమస్య ఏమిటో చెప్పండి. పరిష్కారం నేను చూపిస్తా' నంటూ రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ నగర వాసులకు విజ్ఞప్తి చేశారు. గురువారం కార్పొరేషన్ కార్యాల యంలో జరిగిన ప్రత్యేక ప్రజా విజ్ఞప్తుల పరిష్కార వేదికలో కమిషనర్ ఎం సూర్యతేజ, రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డితో కలిసి మంత్రి అర్జీలు స్వీకరించారు. పలు ప్రాం తాల నుంచి వచ్చి బాధితులు, ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీల నాయకులు వినతులు అందించారు. వాటన్నిటినీ స్వీకరించి వెంటనే పరి ష్కార మార్గాలు చూపాలని అక్కడున్న అధికారు లను ఆదేశించారు. న్యాయస్థానాలతో ముడిపడి ఉన్నవి తప్ప మిగిలిన సమస్యలన్నీ అర్ధరాత్రిలోపు, వీలు కాకపోతే శుక్రవారం నాటికి పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. అనంతరం మాట్లాడిన మంత్రి వారం తరువాత మళ్లీ ప్రజల సమస్యల పరిష్కారాల కోసం వేదికను నిర్వహిస్తామని ప్రకటిం చారు. ప్రతి నెల ఇలాంటి కార్యక్రమాలు క్రమం తప్పకుండా నిర్వహించ డం జరుగుతుందని, రాష్ట్రంలోని అన్ని మున్సి పల్ ప్రాంతాలలో ఉంటాయని, ప్రయోగాత్మకంగా నెల్లూరులోని మొదలుపెట్టి నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సిటీప్లానింగ్ విభాగం రాష్ట్ర డైరెక్టర్ విద్యులత, ఎన్ఎంసీ అధికారులు పాల్గొన్నారు. అనంతరం రైతు బజార్లలో అందించ బోయే సరసమైన ధరలకు సరుకుల వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. కందుకూరు సబ్‌కలెక్టర్ విద్యాధరి మంత్రి నారాయణను మర్యాదపూర్వకంగా కలిశారు.



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న మంత్రి నారాయణ తదితరులు

• మెరుగైన పాలనకు టైం ఇవ్వండి

రాష్ట్రంలోని ప్రజలకు మెరుగైన పాలన అందించేందుకు ప్రజలు కాస్త టైం ఇవ్వాలని మంత్రి నారాయణ అన్నారు. నెల్లూరులోని 48వ డివిజన్, పొర్లుకట్ట ప్రాంతాలలోని పింఛన్లను పంపిణీ చేశారు. రాష్ట్రంలో ఆర్థిక వ్యవస్థను వైసీపీ చిన్నాభిన్నం చేసిందని దానిని గాడినపెట్టేపనిలో ఉన్నామని అన్నారు. ప్రజలు ఓర్పుగా కాస్త సమయం ఇస్తే మెరుగైన పథకాలు, పాలనను అందిస్తామన్నారు. ఈ నెల 15 నుంచి తిరిగి అన్న క్యాంటీన్లు ప్రజలకు అందుబాటులోకి వస్తాయన్నారు. అనంతరం పొర్లు కట్ట నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

కార్యకర్తలని టచ్ చేస్తే ఊరుకోను

- దర్గామిట్ట సీఐపై రూరల్ ఎమ్మెల్యే ఆగ్రహం
- కార్పొరేషన్ కార్యాలయంలో ఉద్రిక్తత

నెల్లూరు(సిటీ) : 'కార్యకర్తలని టచ్ చేస్తే ఊరుకోను. ప్రజా విజ్ఞప్తుల దినంలోకి వెళ్లొద్దనేందుకు నువ్వెవ్వరు? అసలు నీ... పెత్తనమేంది..?' అంటూ నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి దర్గమిట్ట సీఐ అల్తాఫ్ హుసేన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం కార్పొరేషన్ కార్యాలయంలో జరిగిన ప్రత్యేక ప్రజావిజ్ఞప్తుల పరిష్కార వేదిక వద్దకు కార్పొరేటర్లు, టీడీపీ నాయకులు, కార్య కర్తలతో కలిసి ఎమ్మెల్యే వచ్చారు. కార్యాలయంలోకి అనుమతిలేదంటూ సీఐ అల్తాఫ్‌హుసేన్ అభ్యంతరం వ్యక్తం చేసి కార్యకర్తలు, నాయకులు బయట ఉండాలని సూచించారు. దీంతో జోక్యం చేసుకున్న శ్రీధర్‌రెడ్డి వారిని ఆపేందుకు నువ్వెవరు అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంతలో కార్యకర్తలు, నాయకులు జోక్యంతో ఉద్రిక్తంగా మారింది. పోలీసులు వారందరిని బయటకు నెట్టేయగా శ్రీధర్ రెడ్డి మరింతగా కోపోద్రుక్తుడై పోలీసులను నిలదీశారు. ఇంతలో డీఎస్పీ జోక్యం చేసుకుని సర్దుబాటు చేయగా లోపలున్న మంత్రి నారాయణ, కమిషనర్ ఎం సూర్యతేజలలకు శ్రీధర్‌రెడ్డి పరిస్థితిని వివరించారు. సీఐపై తప్పకుండా చర్యలు తీసుకుంటామని కమిషనర్ హామీఇవ్వడంతో ఎమ్మెల్యే శాంతించారు. దర్గామిట్ట సీఐ ఇంకా వైసీపీ మత్తులోనుంచి బయటకు రాలేదంటూ నాయకులు మధన్‌కుమార్, అరవ శీను ఆక్షేపించారు.



సీఐ అల్తాఫ్‌హుసేన్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే



అంగన్‌వాడీ కేంద్రంలో భోజనం చేస్తున్న చిన్నారులు

నిర్వహణ భారంగా..!

- ధరల పెరుగుదలతో అంగన్‌వాడీల అవస్థలు
- నాలుగు నెలలుగా అందని కూరగాయలు, గ్యాస్ బిల్లులు
- ఎన్డీయే ప్రభుత్వంపైనే ఆశలు

ఉదయగిరి రూరల్, ఆగస్టు 1: మహిళా, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ భారంగా మారిందని కేంద్రాల నిర్వహణ కార్యకర్తలు, ఆయాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వంలో పాలకులు ఇచ్చిన హామీలు నీటి మూటలుగా మారాయని చెబుతున్నారు. అంతంతమాత్రంగానే ఉన్న వేతనాలు ఎప్పుడు చెల్లిస్తారో తెలియని పరిస్థితులు ఉన్నాయని వాపోతున్నారు.

జిల్లాలో ఇదీ పరిస్థితి..

12ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 2,934 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఈ కేంద్రాల్లో సుమారు 1.38 లక్షల చిన్నారులు ఉన్నారు. గర్భవతులు, బాలింతలకు ఇంటి వద్దకే పౌష్టి కాహారం పంపిణీ చేస్తున్నారు. గత ప్రభుత్వంలో అంగన్‌వాడీ కేంద్రాలను చాలీ చాలని ఖర్చులతో సిబ్బంది నెట్టకొచ్చారు. దీంతో పాటు బిల్లులు కూడా సకాలంలో మంజూరు చేసేవారు కాదు. నూతనంగా ఏర్పడిన ఎన్డీయే కూటమి ప్రభుత్వమైనా సమస్యలు పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాలని అంగన్‌వాడీ కార్యకర్తలు కోరుతున్నారు.

సకాలంలో అందని బిల్లులు..

మెనూకు సంబంధించి సకాలంలో బిల్లులు అందకపోవడంతో కార్యకర్తలు అప్పులు చేసి చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తున్నారు. ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో కూరగాయలు, గ్యాస్ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఉదయగిరి ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో గత కొన్ని నెలలుగా సెలవులో ఉన్నందున కూరగాయలు, గ్యాస్ బిల్లులు అంగన్‌వాడీ కేంద్రాలకు చెల్లించలేదు. ఈ ఏడాది మార్చి వరకు కార్యకర్తలకు బిల్లులు మంజూరు చేశారు. నాలుగు నెలలపాటు బిల్లులు మంజూరు చేయకపోవడంతో నిర్వహణగా మారిందని వారు వాపోతున్నారు.

ఖర్చు అధికం..

కేంద్రాలకు వచ్చే పిల్లలకు వండి పెట్టేందుకు ఆకుకూరలు, కూరగాయలు, ఇతర సామగ్రిని రోజువారీ కొనుగోలు చేయాల్సి వస్తోంది. ధరలు పెరిగిపోతుండటంతో ప్రభుత్వం ఇస్తున్న నిధులు ఏ మాత్రం సరిపోవడం లేదు.

కేంద్రాల మెనూ ఇలా..

పిల్లల్లో ఒక్కొక్కరికి 75 గ్రాముల బియ్యం, 15గ్రాముల కందిపప్పు, వంట నూనె 5 గ్రా ముల చొప్పున ఇస్తున్నారు. కూరగాయలు, ఇతరత్రా సామగ్రి నిమిత్తం ఒక్కొక్కరికి రూ.1.50 ల వంతున కేటాయిస్తున్నారు.

ధరల పెరుగుదలతో ఇబ్బందులు..

ప్రస్తుతం పెరుగుతున్న కూరగాయల ధరలతో వండి పెట్టడం భారంగా మారుతోందని, కేంద్రాల నిర్వహణకు సొంత నిధులు వెచ్చించాల్సి వస్తోందని కార్యకర్తలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. గ్యాస్‌కు రూ.50పైసలు చొప్పున చెల్లిస్తున్నారని, ఒక్కో గ్యాస్ సిలిండర్‌ను రూ.1000 పెట్టి కొనుగోలు చేయాల్సిన దుస్థితి ఇందని చెబుతున్నారు.

మెనూ చార్జీలు పెంచాలి..

ప్రస్తుతం ఉన్న మెనూలో మార్పులు చేయడంతో పాటు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలు పెంచితే మేలు జరుగుతుందని అంగన్‌వాడీ నిర్వాహకులు చెబుతున్నారు. ప్రస్తుతం మెనూ ఖర్చులకు ప్రభుత్వం ఇస్తున్న వాటికి ఎంతో వ్యత్యాసం ఉంటుందన్నారు. అలా కాకుండా నాణ్యమైన సరుకులతో పాటు నిర్వహణకు అయ్యే ఖర్చు మొత్తాన్ని ప్రభుత్వమే భరించేలా చర్యలు తీసుకోవాలి అంటున్నారు.

అధికారుల దృష్టికి తీసుకెళతాం..

అంగన్‌వాడీ కేంద్రాల్లో నెలకొన్న సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతాం. ప్రతి కేంద్రంలో మెనూ ప్రకారం చిన్నారులకు భోజనం అందించాలని సూచించాం. కూరగాయలు, గ్యాస్ బిల్లులు చెల్లింపుకు చర్యలు చేపడతాం.

- హీనా సుజన, పీడీ, ఐసీడీఎస్

జీజీహెచ్‌లో ముక్కుకు అరుదైన శస్త్రచికిత్స

నెల్లూరు(వైద్యం) ఆగస్టు 1: నెల్లూరు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి వైద్యులు ముక్కుకు అరుదైన శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు. గురువారం జరిగిన ఈ శస్త్రచికిత్స గురించి ఈఎన్‌టీ వైద్యనిపుణులు డాక్టర్ సుకుమార్ వివరాలను తెలియజేశారు. నగరానికి చెందిన దీక్షిత అనే విద్యార్థినికి ఆరునెలలుగా ముక్కుద్వారా గాలి పీల్చుకోటానికి ఇబ్బందికరంగా ఉండేది. పలు ప్రైవేట్ ఆసుపత్రులను సంప్రదించినా ఆపరేషన్‌కు రూ.లక్షలు ఖర్చవుతుందని తెలిపారన్నారు. ఈ నేపథ్యంలో జీజీహెచ్‌కు ఆ విద్యార్థినిని తల్లిదండ్రులు తీసుకువచ్చారన్నారు. సిటీస్కాన్ చేయగా ముక్కు నుంచి గొంతు వైపునకు పెద్ద గడ్డ పెరిగి ఉన్నట్లు గుర్తించామన్నారు. దీంతో ఆహారం కూడా సరిగ్గా తినలేకపోయిందన్నారు. వెంటనే ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సిద్ధానాయక్ చొరవతో శస్త్రచికిత్స నిర్వహించి గడ్డను తొలగించామని వైద్యులు వెల్లడించారు. ఈ శస్త్రచికిత్సలో వైద్యుల బృందం డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ కళ్యాణి, అనస్థీషియా హెచ్‌వోడీ డాక్టర్ శ్రీనివాసులు, డాక్టర్ శారద తదితరులు పాల్గొన్నారు.



శస్త్రచికిత్స చేయించుకున్న విద్యార్థిని

రోడ్డు ప్రమాదంలో బిహార్ వాసి దుర్మరణం

- తిరుమల దైవదర్శనానికి వెళుతుండగా దుర్ఘటన

నెల్లూరు(క్రైం), ఆగస్టు 1: బిహార్ నుంచి దైవదర్శనం తిరుమలకు బయలుదేరిన ఆ గ్రామస్థులలోని ఓ వ్యక్తి నెల్లూరులోని నారాయణ ఇంజనీరింగ్ కళాశాల వద్ద జాతీయ రహదారిపై గురువారం జరిగిన ప్రమాదంలో మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు, బిహార్ రాష్ట్రం సివాన్ జిల్లా మహారాజ్‌గంజ్ మండలం పురాణిబజార్ గ్రామంలో అభిమన్యు ప్రసాద్(73) నివాసం ఉంటున్నాడు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. గతనెల 24న అభిమన్యుప్రసాద్ తన కుటుంబంతోపాటు గ్రామస్థులతో కలిసి బస్సులో తీర్థయాత్రలకు బయలుదేరారు. బుధవారం సాయంత్రం శ్రీశైలంలో స్వామివారిని దర్శించుకొని తిరుమలకు బయలుదేరారు. గురువారం తెల్లవారుజామున నగరంలోని నారాయణ ఇంజనీరింగ్ కళాశాల జంక్షన్ వద్ద జాతీయరహదారి సమీపంలోని పెట్రోల్‌బంకు వద్దకు చేరుకున్నారు. అక్కడ బస్సు ఆపి అందరూ కాలకృత్యాలు తీర్చుకుంటున్నారు. ఈ క్రమంలో అభిమన్యుప్రసాద్ రోడ్డు దాటుతుండగా చెన్నై నుంచి అద్దంకి వెళుతున్న కారు వేగంగా ఢీకొంది. ఈ ఘటనలో ఆయనకు తీవ్రగాయాలయ్యాయి విషయాన్ని గమనించిన కుటుంబసభ్యులు, గ్రామస్థులు వెంటనే అంబులెన్స్‌లో క్షతగాత్రుడిని సమీపంలోని మెడికవర్ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అభిమన్యుప్రసాద్ మృతి చెందాడు. ఈ విషయమై మృతుడి కుమారుడు చున్నూకుమార్ నెల్లూరు నార్త్ ట్రాఫిక్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కి తరలించారు. ప్రభుత్వ వైద్యులు మృతదేహానికి పోస్టుమార్టం పూర్తి చేసి బాధిత కుటుంబానికి అప్పగించారు. నార్త్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	112
లేయర్ లైవ్	95
స్కిన్ చికెన్	206
స్కిన్‌లెస్	230
లేయర్	162

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.6660
వెండి కిలో ధర	రూ. 86,200
వెండి ఒక గ్రాము	రూ. 88.20

రోడ్డుపై లారీ బోల్తా

కావలి రూరల్: పట్టణ సమీపంలోని మద్దూరుపాడు జాతీయ రహదారిపై గురువారం లారీ బోల్తా పడింది. చెన్నై నుంచి చత్తీస్‌ఘడ్‌కు టెంకాయల లోడుతో వెళ్తున్న లారీ అదుపుతప్పి జాతీయ రహదారి సర్వీస్ రోడ్డుకు మధ్యన ఉన్న రైలింగ్‌ను ఢీ కొని రోడ్డుకు అడ్డంగా లారీ బోల్తా పడింది. ఆ సమయంలో సర్వీస్ రోడ్డులోను, లారీ వెనుక వైపు వాహనాలు రాకపోవటంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ మురుగేష్‌కు స్వల్పగాయాలయ్యాయి. లారీలో నిద్రపోతున్న మరో డ్రైవర్ మురుగేషన్ ఎలాంటి గాయాలు లేకుండా బయటపడ్డాడు.



పశువైద్యశాలలో మందుల్లేవ్?

- సేవలకే పరిమితమైన వైద్యులు
- గత ప్రభుత్వ వైఫల్యమే కారణమంటున్న పాడి రైతులు, వైద్యులు
- కూటమి ప్రభుత్వంపై ఆశలు

సంగం, ఆగస్టు 1: జిల్లాలో అత్యధిక ప్రజల ప్రధాన వృత్తి వ్యవసాయం. దానికి అనుబంధరంగం పాడి పరిశ్రమ. ఈ రెండు వ్యవస్థలను గత వైసీపీ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో నిర్వీర్యం అయ్యాయి. అందులో భాగంగా ఉన్న పశువుల ఆరోగ్యాన్ని వైసీపీ ప్రభుత్వం విస్మరించింది. ఆఖరుకు పశువుల ఆస్పత్రుల్లో చాలావరకు మందులు లేని దుస్థితికి చేరింది.

రైతులకు.. పాడి ప్రధాన ఆదాయ వనరు..

జిల్లాలో రైతులకు నిత్య ఆదాయ వనరు, కుటుంబ ఆర్థిక వనరుగా పశుసంపద. జిల్లా వ్యాప్తంగా ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు కలిపి లక్షల్లో ఉన్నాయి. వాతావరణంలో వచ్చే మార్పులతో జీవాలు, పశువులకు అనేక రకాల జబ్బులు వస్తుంటాయి. అయితే వీటికి పశువైద్యం అందించేందుకు మండలానికి ఒకరు లేదా ఇద్దరు వైద్యులు ఉంటారు. వీటితో పాటు 2000 వేల పశువులకు ఒక సబ్ సెంటర్ ఉంటుంది. అయితే పశువుల ఆసుపత్రులకు సరైన మందులు సరఫరా చేయకపోవడంతో ఎన్నో మూగజీవాలు ఏటా అకాలంగా మృత్యువాత పడ్డాయి. చనిపోయిన వాటికి కనీసం బీమా కూడా లేదు. దీంతో పాడి పరిశ్రమ రైతులకు ఆసరాగా లేకుండా పోతుంది. రైతులు పశువైద్యం కోసం డిస్పెన్సరీకి వెళితే వైద్యులు చూసించే మందులు అక్కడ లేక ప్రైవేటుగా కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. పశువుల్లో తరచుగా వచ్చే పొదుగువాపు, గొంతువాపు, జబ్బవాపు, గాలికుంటు, బ్రూసెల్లోసిస్, గర్భాశయ వ్యాధులకు తగిన యాంటీబయోటిక్ మందులు వైద్యశాలల్లో ఉండడం లేదు. సచివాలయాల ద్వారా అనుభవం లేని వీపీఏలను నియమించిన పాడి రైతులకు ఒరిగిందేమి లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నాటి పథకాలు అమలయ్యేనా..

గతంలో టీడీపీ హయాంలో వైద్యులతో గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ఉచితంగా మందులు అందచేసేవారు. సబ్సిడీపై పశు రుణాలు, పశువుల షెడ్లు, పశుల దాణా, పశుబీమా ఇలా అనేక పథకాలు అమలయ్యేవి. ఎన్డీయే కూటమి అధికారంలోకి రావడంతో గత టీడీపీ హయాంలో అమలైన పథకాలు అమలు చేసి పాడి రైతులను ఆదుకోవాలని రైతాంగం కోరుతున్నారు.



పశు వైద్యశాల

జగన్ పాలనలో రాష్ట్రం అప్పులపాలు

- కలెక్టరేట్ ఎదుట ధర్నాలో చింతామోహన్

నెల్లూరు (హరనాథ పురం); ఆగస్టు 1: జగన్ పాలనలో రాష్ట్రం అప్పులపాలు అయిందని కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ ఆరోపించారు. గురువారం ఆయన కలెక్టరేట్ ఎదుట దళిత నాయకులతో కలిసి ధర్నా చేశారు. ఆయన మాట్లాడుతూ ఈ రోజు రాష్ట్రం అధ్వానస్థితిలో ఉందంటే అది జగన్‌మోహన్‌రెడ్డి వల్లనేనన్నారు. రెవెన్యూ వ్యవస్థ నాశనమై పోయిందన్నారు, నెల్లూరు కలెక్టరేట్‌లో అడంగళ్లు ఉండేవన్నారు. ఇప్పుడు అవి లేకుండా పోయాయన్నారు. వైసీపీ పాలనలో ఎస్సీ కార్పొరేషన్ నిర్వీర్యమైపోయిందని ఆరోపించారు. ఎస్సీలకు అందాల్సిన పథకాలు, రుణాలు అందకుండా పోయాయని చెప్పారు. ఎస్సీ ఫైనాన్స్ కార్పొరేషన్‌ను వెంటనే పునరుద్ధరించి, వారికి రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ తదితరులు

● అమరావతికి ప్రపంచ బ్యాంకు అప్పు ఇవ్వదు

నెల్లూరు (సాంస్కృతికం): ఏపీ రాజధాని అమరావతి పునఃనిర్మాణానికి ప్రపంచ బ్యాంకు అప్పు ఇవ్వదని, అప్పు రాదని కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ తెలిపారు. గురువారం ఆయన నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. వ్యవసాయ భూములు ఉన్న చోట అప్పు ఇవ్వరాదని వరల్డ్ బ్యాంకు నిబంధనల్లో ఉందన్నారు. కేంద్ర బడ్జెట్‌లో ఎన్డీఏ ప్రభుత్వం చంద్రబాబు చెవిలో పూలు పెట్టిందని ఆయన ఎద్దేవా చేశారు. కేంద్ర బడ్జెట్ గ్రాంటుగా అమరావతికి, పోలంవరం ప్రాజెక్టుకు ఒక్కపైసా నిధులు రాలేదన్నారు. కేంద్రం ఏపీ పునఃనిర్మాణానికి రూ.15వేల కోట్లు అప్పు ఇప్పిస్తామమని చెప్పడం రాష్ట్రాన్ని దగా చేయడమేనన్నారు.కార్యక్రమంలో విజయకుమార్, చందనమూడి శివ, రామచంద్రయ్య, విజయబాబు, యానాదయ్య, అంకయ్య, తదితరులు పాల్గొన్నారు.

కోర్టు క్యాంటీన్‌లో పొగరాయుళ్లు



నెల్లూరు (లీగల్), ఆగస్టు 1: నెల్లూరు జిల్లా కోర్టు ప్రాంగణంలో ధూమపానం ధాటికి న్యాయవాదులు, కక్షిదారులు అల్లాడిపోతున్నారు. కోర్టు ప్రాంగణంలో ఉన్న క్యాంటీన్‌కు న్యాయవాదులు, మహిళా న్యాయవాదులు, సివిల్ కేసులలో వచ్చే కక్షిదారులు వేలాదిగా వస్తూ పోతూ ఉంటారు. అయితే ఈ ప్రాంతంలో ధూమపానం సేవించే వారి సంఖ్య ఎక్కువైంది. దీంతో న్యాయవాదులు, కక్షిదారులు, ప్రత్యేకించి మహిళా న్యాయవాదులు అసౌకర్యానికి గురవుతున్నారు. జనసంద్రం ఉన్న ప్రదేశాల్లో బహిరంగ ధూమపానం నిషిద్ధం. ఇందుకు సంబంధించి సుప్రీం కోర్టు ఆదేశాలు కూడా ఉన్నాయి. అయితే ధూమపానం సేవించేవారు ఎలాంటి జంకూ బొంకూ లేకుండా క్యాంటీన్‌కి వెళ్లేవారికి అసౌకర్యం కలగచేస్తున్నారు. కోర్టు ప్రాంగణంలో ఉన్న గార్డులు, పోలీసులు కూడా వీరి గురించి పట్టించుకోరు. సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకుని కోర్టు ప్రాంగణంలోని క్యాంటీన్‌తోపాటు మిగతా ప్రాంతంలో ఎక్కడా ధూమపానాన్ని పూర్తి నిషేధించాలని న్యాయవాదులు, కక్షిదారులు కోరుతున్నారు.

నెల్లూరు నగరంలో యువకుడి అనుమానాస్పద మృతి

- తల్లి, తమ్ముడిపైనే అనుమానం

నెల్లూరు (క్రైం), ఆగస్టు 1: నెల్లూరులోని శివప్రియ లాడ్జి వెనుక గురువారం సాయంత్రం ఓ యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు, బీ చంద్ర,లక్ష్మి దంపతులకు రాజేష్(34), ఈశ్వర్ కుమారులు.వీరికి వివాహం కాలేదు. రాజేష్ ఓ వస్త్రదుకాణంలో పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో అతను మద్యానికి బానిసై నిత్యం ఇంట్లో గొడవ పడేవాడు. తమ్ముడితో నిత్యం ఘర్షణకు దిగేవాడు. ఈ క్రమంలో ఏమి జరిగిందో ఏమో.. గురువారం సాయంత్రం నాలుగు గంటల సమయంలో రాజేష్ మృతి చెందాడు. చిన్నబజారు పోలీసులకు రాత్రి విషయం తెలియడంతో ఇన్‌స్పెక్టర్ అశోక్‌కుమార్ ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతుడి తలపై కత్తితో నరికిన గాయాలున్నాయి. మద్యం సేవించి తానే గాయాలు చేసుకోవడంతో మృతి చెందాడని తల్లి, తమ్ముడు పోలీసులకు తెలిపారు. వారి మాటలు నమ్మశక్యంగా లేకపోవడంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. వారే ఈ హత్యకు పాల్పడి ఉండవచ్చని వారు అనుమానిస్తున్నారు. సమాచారం అందుకున్న నగర డీఎస్పీ శ్రీనివాసులురెడ్డి చిన్నబజారు పోలీసు స్టేషన్‌కు చేరుకొని ఘటన జరిగిన తీరును తెలుసుకున్నారు.

న్యాయవాదులు నేడు విధుల బహిష్కరణ

నెల్లూరు (లీగల్), ఆగస్టు 1 : బెజవాడ బార్ అసోసియేషన్‌కు చెందిన న్యాయవాది గవాస్కర్‌ను అక్రమంగా పోలీసులు క్రిమినల్ కేసులో ఇరికించడాన్ని నిరసిస్తూ శుక్రవారం కోర్టు విధులను బహిష్కరించాలని తీర్మానించినట్లు నెల్లూరు బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పీ ఉమామహేశ్వరరెడ్డి, ఎం.సుందరయ్య యాదవ్ ఓ సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు గురువారం మధ్యాహ్నం అత్యవసరంగా జరిగిన బార్ అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ మీటింగ్‌లో ఈ మేరకు తీర్మానించినట్లు వారు తెలిపారు. కార్యక్రమానికి న్యాయమూర్తులు, న్యాయవాదులు సహకరించాలని వారు విజ్ఞప్తి చేశారు.

నేడు మంత్రి జనార్ధన్ పర్యటన

నెల్లూరు(హరనాథపురం); ఆగస్టు 1: రాష్ట్ర రహదారులు, భవనాలశాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి శుక్రవారం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 11.30 గంటలకు మంత్రితోపాటు శాఖ కార్యదర్శి ఎస్. సురేష్ కుమార్, మారిటైం బోర్డు సీఈవో ప్రవీణ్ ఆదిత్య, జిల్లా కలెక్టర్ ఆనంద్ ఇతర అధికారులతో కలిసి రామాయపట్నం పోర్టులో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలిస్తారు. అక్కడ నుంచి బయలుదేరి 2.45 గంటలకు జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌కు చేరుకొని జరుగుతున్న పనులను పరిశీలిస్తారు. అనంతరం విజయవాడకు బయలుదేరి వెళతారు.

4న బాల్‌బ్యాడ్మింటన్ జిల్లా జట్ల ఎంపికలు

నెల్లూరు (విద్య), ఆగస్టు 1 : జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 4న నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో జిల్లా బాల,బాలికల జట్లను ఎంపిక చేయనున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి ఐ.రమేష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికలకు 2009 జనవరి 2 తరువాత జన్మించిన వారు అర్హులని, ఆసక్తి కలిగిన వారు వయసు ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డులతో ఆరోజు ఉదయం 8 గంటలకు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. జిల్లా జట్లకు ఎంపికైన క్రీడాకారులు సెప్టెంబరు 13 నుంచి 15వతేదీ వరకు తూర్పుగోదావరి జిల్లా అన్నవరంలో జరిగే 9వ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ పోటీలకు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారన్నారు.

తల్లిపాల వారోత్సవాల పోస్టర్లు ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచలయ్య

నెల్లూరు(వైద్యం) ఆగస్టు 1 : తల్లిపాల ప్రాముఖ్యతను తెలియచేస్తూ డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచలయ్యతోపాటు పలువురు వైద్యులు పోస్టర్లను ఆవిష్కరించారు. గురువారం డీఎంహెచ్‌వో చాంబర్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో పెంచలయ్య మాట్లాడారు. ఆగస్టు 1 నుంచి 7 వరకు తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రతితల్లి పుట్టిన అరగంటలోపే బిడ్డకు పాలు ఇవ్వాలన్నారు. బిడ్డకు రెండేళ్ల వరకు అనుబంధ ఆహారంతోపాటు తల్లిపాలు ఇవ్వాలని తెలిపారు. తల్లిపాలే బిడ్డకు తొలిటీకా అని చెప్పారు. ఈ కార్యక్రమంలో అదనపు జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఖాదర్‌వలి, డీఐవో డాక్టర్ ఉమామహేశ్వరి, డెమో శ్రీనివాసరావు, డిప్యూటీ డెమో కనకరత్నం, మంజుల, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బియ్యం పంపిణీకే 438 వాహనాలా ?

- కందిపప్పు, చక్కెర సరఫరా ఏది...?
- ఇంటింటికీ కూడా పంపిణీ నిల్

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 1 : కేవలం బియ్యం పంపిణీకే రూ.లక్షల విలువైన ఎండీయూ వాహనాలు వినియోగించడంపై జనం విస్తుపోతున్నారు. ఈ వాహనంలోని డ్రైవర్, సహాయకుడు సైరన్ మోగించుకుంటూ వచ్చి ఇచ్చేది బియ్యం మాత్రమే. జిల్లాలో 438 ఎండీయూ వాహనాలు తిరుగుతున్నాయి. గత వైసీపీ ప్రభుత్వం ఇంటివద్దకే రేషన్ సరుకులు అంటూ ఆర్భాటంగా ప్రారంభించిన ఎండీయూ వాహనాలు మూడు నెలల నుంచి కేవలం బియ్యం పంపిణీకే పరిమితమయ్యాయి. ఇంటివద్దకే సరుకుల పంపిణీ పేరుతో ఆ వాహనాలు ప్రవేశపెడితే, అవి ఏనాడూ ఇంటి వద్దకు వచ్చి సరుకులు పంపిణీ చేయలేదు. వీధిలో చివర ఆగితే వాటి వద్దకే వెళ్లి కార్డుదారులు సరుకులు తెచ్చుకుంటున్నారు. ఈ వాహనాల నిర్వాహకులు రేషన్ షాపుల్లో సరుకులు తీసుకొని, డీలర్ వద్ద లెక్కరాసి, తమ వాహనాల్లో ఉంచుకొని సరఫరా చేయాలి. రేషన్ షాపులు యథాతథంగా ఉన్నాయి. రేషన్ డీలర్లు తమకు గౌరవ వేతనం ఇస్తే చాలని పోరాటం చేశారు. అయినా ఫలితం కనిపించలేదు. ఈ ఎండీయూ వాహనాలకిచ్చే మొత్తం డీలర్లకు ఇస్తే వారి జీవనభృతికి మార్గం సుగమం అవు తుంది. అంతేకాక ఎప్పుడు కావాలంటే అప్పుడు రేషన్ షాపు నకు వెళ్లి సరుకులు తెచ్చుకొనే వెసులుబాటు ఉంటుందని ప్రజలంటున్నారు. ఇప్పుడా వెసులుబాటు లేదని, వాహనం వచ్చినప్పుడే వీధిలోకి వెళ్లి తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఉందని పలువురు అంటున్నారు. వైసీపీ పాలనలో రేషన్ షాపుల్లో కందిపప్పు ఇవ్వటం ఆపేశారు. అయితే ప్రభుత్వం మారిన వెంటనే కందిపప్పు, పంచదార పంపిణీ చేస్తామని కూటమి నేతలు ప్రకటించారు. అయితే కందిపప్పు పంపిణీ జరగలేదు. జిల్లాలో 7.25 లక్షల రేషన్ కార్డుదారులు ఉన్నారు. వీరంతా కందిపప్పు, చక్కెర కోసం ఎదురు చూస్తున్నారు.



రేషన్ బియ్యం పంపిణీ చేస్తున్న ఎండీయూ వాహనం(ఫైల్)

రేషన్ షాపుల నుంచి వీఆర్వోలను తొలగించాలి



డీఎంతో మాట్లాడుతున్న రేషన్ డీలర్లు

నెల్లూరు(హరనాథపురం); ఆగస్టు 1 : ఎస్‌హెచ్‌జీలు, వీఆర్‌ఏలు, వీఆర్వోల పేర్లతో ఉండే రేషన్ షాపుల నుంచి, వారిని తొలగించి పక్కనే ఉండే రేషన్ డీలర్లకు ఇన్‌చార్జిలుగా ఇవ్వాలని నెల్లూరు నగర చౌకధరల దుకాణా డీలర్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎస్. కుమారస్వామి కోరారు. ఈ మేరకు ఆయన సివిల్ సప్లైస్ డీఎం లక్ష్మీనారాణకు గురువారం వినతిపత్రం అందచేశారు. వారంతా వైసీపీకి చెందిన వారని ఆరోపించారు. కోవిడ్ సమయంలో డీలర్లకు రావాల్సిన కమీషన్‌ను, నాణ్యత లేని కందిపప్పు తిరిగి ఇవ్వటం వల్ల రావాల్సిన స్టాక్‌ను తిరిగి ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు డీలర్లు పాల్గొన్నారు.

30 ఏళ్ల పోరాటం నేడు ఫలించింది..!

- వర్గీకరణతోనే మాదిగలకు న్యాయం
- సీమాంధ్ర ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు



బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పిస్తున్న పందిటి సుబ్బయ్య మాదిగ

నెల్లూరు (హరనాథ పురం); ఆగస్టు 1: ఎస్సీ వర్గీకరణ కోసం గత 30 ఏళ్లుగా చేసిన పోరాటం నేడు ఫలించిందని సీమాంధ్ర ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు పందిటి సుబ్బయ్య మాదిగ అన్నారు. నెల్లూరు నగరంలోని వీఆర్సీ సెంటర్ వద్ద ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి ఆయన గురువారం పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం నాయకులతో కలిసి కేట్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మూడు దశాబ్దాల ఎస్సీ వర్గీకరణ ఉద్యమానికి అనుకూలంగా నేడు సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చిందని, ఈ తీర్పు చారిత్రాత్మకమైందని పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణకు రాష్ట్రం వెంటనే చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణతో 59 కులాలకు న్యాయం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ బద్దెపూడి రవీంద్ర, మందాబాబ్జీ, తాటిపర్తి రఘు, ఎస్‌కే రియాజ్, కన్యకేశ్వరరావు, డానియల్, రేణుక తదితరులు పాల్గొన్నారు.

కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఉద్రిక్తత

నెల్లూరు (సాంస్కృతికం) ఆగస్టు 1: నెల్లూరు స్టోన్‌హౌస్‌పేట వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో గురువారం సాయంత్రం ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఆలయ కమిటీ మాజీ గౌరవాధ్యక్షుడు ముక్కాల ద్వారకానాథ్ వర్గం, ప్రస్తుత పాలక మండలి అధ్యక్షుడు కోటగురు బ్రహ్మం వర్గాల మధ్య తోపులాట, వాగ్వివాదం జరిగింది. బుధ వారం ఆలయానికి పాలక మండలిని నెల్లూరు అర్బన్ ఆర్యవైశ్య సంఘం నియమించింది. దీంతో పాల కవర్గం ప్రమాణ స్వీకారం చేసింది. కాగా వాసవీ క్లబ్ సిటీ ఆధ్వర్యంలో శుక్రవారానికి శాకాంబరి అలంకారం ఏర్పాట్లు జరు గుతున్నాయి.ఈ ఏర్పాట్లను పాలక వర్గం అధ్యక్షుడు కోటగురుబ్రహ్మం, గౌరవ సలహా దారుడు షేగు షణ్ముగం ఆధ్వర్యంలో సభ్యు లు పర్యవేక్షి స్తున్నారు. ఈ క్రమంలో ముక్కా ల తన అనుచరులతో ఆలయానికి వచ్చి అమ్మవారికి దర్శించుకున్నారు. అనంతరం ప్రెస్‌మీట్‌కు సిద్ధమయ్యారు. దీంతో కొత్త కమిటీ నాయకులు అడ్డుకోగా, ఇరువర్గాల మధ్య తోపులాటలు, వాగ్వివాదం జరిగింది. సమాచారం అందుకున్న రెండో నగర సీఐ బాబ్జి తన సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు.



ఇరువర్గాల తోపులాట, వాగ్వివాదం

ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ


ఆత్మకూరులో పింఛన్లు పంపిణీ చేస్తున్న తుమ్మల చంద్రారెడ్డి

ఆత్మకూరు, ఆగస్టు 1: మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డులో టీడీపీ పట్టణాధ్యక్షుడు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ తుమ్మల చంద్రారెడ్డి సచివాలయ సిబ్బందితో కలిసి గురువారం లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేశారు. 10వ వార్డులో ఆత్మకూరు మాజీ ఉప సర్పంచ్ చల్లా రవికుమార్‌రెడ్డి పాల్గొన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ సర్దార్, కౌన్సిలర్లు, నేతలు వార్డుల్లో పింఛన్లు పంపిణీ చేశారు.

ఉదయగిరి రూరల్:17పంచాయతీల్లో 95శాతం మంది లబ్ధిదారులకు పింఛన్ల నగదు పంపిణీ చేసినట్లు ఎంపీడీవో దేవరకొండ ఈశ్వరమ్మ గురువారం తెలిపారు. ఉదయగిరి, కొండాయపాళెం పంచాయతీల్లో జరిగిన కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ బయ్యన్న, పార్టీ రాష్ట్ర కార్యదర్శి మన్నేటి వెంకటరెడ్డి, రాష్ట్ర మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడు షేక్ రియాజ్ పాల్గొన్నారు.


అనంతసాగరం : గౌరవరంలో నగదు అందిస్తున్న సర్పంచి సుబ్బారావు

సంగం: మండలంలోని అన్ని సచివాలయాల పరిధిలో ఈ నెల పింఛన్ పంపిణీ కార్యక్రమం లో టీడీపీ నేతలు జోరుగా పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొమ్మి లక్ష్మయ్య నాయుడు తరుణవాయి, ఉడ్‌హౌస్‌పేటలో ఇంటింటికి వెళ్లి పింఛన్లు అందజేశారు. మండలాధ్యక్షుడు గుండ్లపల్లి శ్రీనివాసులు యాదవ్, రాజేష్‌రెడ్డి పాల్గొన్నారు.


సంగం : తరుణవాయిలో పంపిణీలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కొమ్మి లక్ష్మయ్య నాయుడు

వింజమూరు: గుండెమడకలలో ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేశారు. అనంతరం గ్రామ హైస్కూల్‌ను సందర్శించారు. మండల కన్వీనర్ గొంగటి రఘునాథ్ రెడ్డి, నర్సారెడ్డి, సుదర్శన్‌రెడ్డి, పాల్గొన్నా రు.

వరికుంటపాడు: 24పంచాయతీల్లో 96శాతం పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీవో వెంకట కృష్ణకుమారి తెలిపారు. 4,281 మందిలో 4,100 మందికి ఇంటింటికి వెళ్లి పింఛన్ల నగదులను అందజేశామన్నారు. అలాగే పెద్దిరెడ్డిపల్లి సచివాలయ సర్వేయర్ కాశె కొండయ్య నెల్లూరు వైద్యశాలకు వెళ్లి గ్రామానికి చెందిన గుర్రం సుబ్బారావుకు నగదుతో పాటు మరో రూ.10వేలను సొంతంగా అందజేశాడు. ఈయన కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతూ ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు.

చేజర్ల: టి.కే.పాడు, పాతపాడులో చేపట్టిన పింఛన్ల పంపిణీలో నియోజక వర్గమాజీ శాసన సభ్యుడు కొమ్మి లక్ష్మయ్యనాయుడు పాల్గొన్నారు. పార్టీ మండలాధ్యక్షుడు రావి లక్ష్మీ నరసారెడ్డి, మాజీ ఎంపీపీ అన్నలూరు శ్రీనివాసుల నాయుడు, రమేష్‌నాయుడు పాల్గొన్నారు.


వింజమూరు : గుండెమడకలలో పింఛన్ల పంపిణీలో పాల్గొన్న ఎమ్మెల్యే సురేష్

అనంతసాగరం: 25 గ్రామ పంచాయతీలో పింఛన్ల పంపిణీ అట్టహాసంగా నిర్వహించారు. తొలిరోజు 96శాతం పూర్తి చేసిన్నట్లు ఎంపీడీవో తాజ్‌మస్రూర్ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

సీతారామపురం: స్థానిక హరిజనవాడలో పార్టీ మండల కన్వీనర్ కప్పా ప్రభాకర్ రాజు, సీతారామపురం సర్పంచి కొడవటికంటి భాగ్యకుమారిలు పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్ర మంలో మండల క్లస్టర్ ఇన్‌చార్జి వెంకటేశ్వర్లు, చెన్నకేశవులు, దేవర వెంకటేశ్వర్లు, జాషువా, వెంకటయ్య, కిరణ్, రాజేష్, మాల్యాద్రి, మనోజ్ పాల్గొన్నారు. 93.5 శాతం పంపిణీ చేసినట్లు ఎంపీడీవో అబ్దుల్ కలాం ఆజాద్ తెలిపారు.


వరికుంటపాడు : పింఛన్ అందిస్తున్న సర్వేయర్ కొండయ్య

చిత్రపటాల అందజేత

చేజర్ల, ఆగస్టు 1: ఆదురుపల్లిలోని ప్రభుత్వ కార్యాలయాలకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చిత్రపటాలను స్థానిక నాయకులు చీర్ల వెంకటేశ్వర్లు అందజేశారు. కార్యక్రమంలో చీర్ల వెంకటయ్య, ఎన్.పెంచలయ్య, అంకయ్య పాల్గొన్నారు.

శ్మశాన స్థలం మంజూరు చేయండి


ఇన్‌చార్జి తహసీల్దార్ గిరీష్‌కు వినతిపత్రం ఇస్తున్న కాలనీవాసులు

అనంతసాగరం, ఆగస్టు 1: స్థానిక గిరిజన కాలనీలోని 100కుటుంబాలకు శ్మశాన స్థలం కేటాయించాలని సీపీఎం నాయకులు గురువారం ఇన్‌చార్జి తహసీల్దారు గిరీష్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు అన్వర్‌బాష, కాలనీ వాసులు పాల్గొన్నారు.

సాధారణ సమావేశంలో ఏకగ్రీవ తీర్మానాలు

వింజమూరు, ఆగస్టు 1 : శంఖవరం గ్రామ పంచాయతీ సాధారణ సమావేశం గురువారం సర్పంచ్ భోగిరెడ్డి మల్లేశ్వరి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో పారిశుధ్య మెరుగు, వీధి దీపాలు డ్రైనేజీ, మంచినీటి సౌకర్యం తదితర అంశాలపై ప్రతిపాదనలు చేశారు. వాటికి పంచాయతీ సభ్యులు ఆమోదం తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సురేష్, భోగిరెడ్డి ఓబులిరెడ్డి, వార్డు సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ముర్రుపాలతో వ్యాధి నిరోధకశక్తి

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), ఆగస్టు 1: తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరమని, బిడ్డ పుట్టిన అరగంటలోపు ముర్రుపాలు తాపిస్తే పిల్లల్లో వ్యాధినిరోధకశక్తి పెరుగుతుందని దుత్తలూరు ప్రాథమిక కేంద్ర ఆరోగ్య బోధకురాలు బీబీజాన్ సూచించారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా గురువారం సోమలరేగడ మెయిన్ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాలపై గర్భవతులు, బాలింతలకు అవగాహన కల్పించారు. పిల్లలకు పాలిస్తే అందం తరగిపోతుందనే అపోహలు నమ్మవద్దన్నారు. తల్లిపాలు బిడ్డకు అమృతం లాంటివన్నారు. పౌష్టికాహారం తీసుకొని ఆరోగ్యవంతంగా ఉండాలన్నారు. ఆరోగ్య పర్యవేక్షకులు ఖాజామొహిద్దీన్, ఏఎన్ఎం చంద్రావతి, ఆరోగ్య కార్యకర్త అరాఫత్, మహిళా పోలీసు షబానా, అంగన్‌వాడీ కార్యకర్త లక్ష్మమ్మ పాల్గొన్నారు.

గంధోత్సవానికి ఎంపీ, ఎమ్మెల్యేల రాక

ఉదయగిరి రూరల్, ఆగస్టు 1: స్థానిక పంచాయతీ బస్టాండ్ సెంటర్‌లో వెలసిన హజరత్ ఖ్వాజాషా సయ్యద్ అబ్దుల్ ఖాదర్‌ఖాన్ సాహెబ్ ఖాదరీ ఔలియా గంధోత్సవం శనివారం నిర్వహించనున్నట్లు, ఈ ఉత్సవాలకు నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఉదయగిరి, కావలి శాసన సభ్యులు కాకర్ల సురేష్, దగుమాటి కృష్ణారెడ్డిలు హాజరవుతున్నట్లు దర్గా కమిటీ చైర్మన్ రోజ్‌ధార్ మన్సూర్, టీడీపీ రాష్ట్ర మైనారిటీ సెల్ ఉపాధ్యక్షులు రియాజ్‌లు పేర్కొన్నారు. గురువారం దర్గా ఆవరణలో విలేకరులతో మాట్లాడారు. భక్తులకు అసౌకర్యం లేకుండా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. కార్యక్రమంలో ఖాదర్‌బాషా, సికిందర్, లియాఖత్, ముజీబ్ తదితరులు పాల్గొన్నారు.

యువకులే పారిశుధ్య కార్మికులు

ఉదయగిరి రూరల్, ఆగస్టు 1: స్థానిక దిలావర్ భాయ్‌వీధిలోని మురుగు కాలువల్లో చెత్తాచెదారం పేరుకుపోయి రోడ్లపై నీరు పారుతుంది. ఈ విషయాన్ని గుర్తించిన యువకులు స్పందించారు. గురువారం కాలువలను శుభ్రం చేశారు. వీధిలో ఎక్కడపడితే అక్కడ చెత్త పేరుకుపోయిన చెత్తను తొలగించారు.

కరపత్రాల ఆవిష్కరణ

ఆత్మకూరు, ఆగస్టు 1: ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) స్థాపించి 80ఏళ్లు పూర్తయిన సందర్భంగా నెల్లూరు టౌన్‌హాలులో ఈ నెల 10న నిర్వహించనున్న విద్యా, వైజ్ఞానిక మహాసభలను విజయవంతం చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ వెంకటేశ్వర్లురెడ్డి, జిల్లా అధ్యక్షుడు సురేంద్రరెడ్డి కోరారు. గురువారం కరటంపాడు, మహిమలూరు, అప్పారావుపాళెం, బట్టేపాడు, మురగళ్ల పాఠశాలల్లోని ఉపాధ్యాయులను కలిసి కరపత్రాలను అందజేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఎన్నికల కమిటీ సభ్యుడు సీహెచ్ మల్లికార్జునరెడ్డి, ఏపీటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ నాయకుల సంబరాలు


ఉదయగిరిలో పాలభిషేకం నిర్వహిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ఉదయగిరి రూరల్, ఆగస్టు 1: ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడంతో గురువారం ఉదయగిరి పంచాయతీ బస్టాండ్ సెంటర్‌లో ఎమ్మార్పీఎస్ నాయకులు సంబరాలు చేసుకున్నారు. బాణ సంచా కాల్చి మిఠాయిలు పంచిపెట్టారు. ఎమ్మార్పీఎస్ వ్యవ స్థాపకులు మంద కృష్ణమాదిగ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర నాయకులు బకీరు జాషువా, బెజవాడ బాలగురవయ్య, అశోక్, పెంచలయ్య, ఇత్తడి రమణయ్య, ఆవుల రోశయ్య, నల్లిపోగు నరసింహ పాల్గొన్నారు.

కలువాయి: స్థానిక బస్టాండులోని అంబేద్కర్ విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళుర్పించారు. అనంతరం మంద కృష్ణమాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. బాణ సంచా కాల్చి స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు దండు పెంచలయ్య, నరసింహులు, ఏడీపీయస్ నాయకులు నిజమాల ప్రసాద్ పాల్గొన్నారు.

వింజమూరు: ఎమ్మార్పీఎస్ ఉద్యమకారులు, మండల ఎంఎస్పీ అధ్యక్షుడు గంగపట్ల సురేష్ మాదిగ ఆధ్వర్యంలో బంగ్లా సెంటర్‌లోని బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అశోక్‌నగర్ కాలనీలో సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు మల్లెల తిరుమలేశుమాదిగ, ఎంఎంఎస్ జిల్లా అధ్యక్షురాలు మంద సుజాతమాదిగ, గంగపట్ల మురళీ మాదిగ, గంగపట్ల నాగరాజు మాదిగ పాల్గొన్నారు.


కలువాయిలో సంబరాలు చేసుకుంటున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలకు నోటిఫికేషన్

ఉదయగిరి రూరల్, ఆగస్టు 1: మండలంలోని 60ప్ర భుత్వ పాఠశాలల్లో యాజ మాన్య కమిటీ ఎన్నికల నిర్వహ ణకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఎంఈవో షేక్ మస్తా న్‌వలి తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఆయన విలేక రులతో మాట్లాడారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి తరగతుల వారీగా ఓటర్ల జాబితా చేశామన్నారు. 5న ఫిర్యాదులపై అభ్యం తరాల స్వీకరణ, నోటీసు బోర్డుపై తుది ఓటర్ల జాబితా ప్రదర్శిస్తామని చెప్పారు. ప్రతి తర గతి నుంచి ముగ్గురు సభ్యులను ఎన్నుకుంటామన్నారు. 8న ఎస్ఎంసీ సభ్యుల ఎన్నిక, అ నంతరం చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక జరుగుతుందన్నారు. అదేరోజు సభ్యుల ప్రమాణ స్వీకారం, తొలి సమావేశం నిర్వహిస్తామన్నారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చూడాలని ప్రధానోపాధ్యాయులకు సూచించినట్లు తెలిపారు.

వరికుంటపాడు: ఎస్ఎంసీ ఎన్నికలకు సంబంధించి గురువారం పాఠశాలల్లో ఎన్నికల నోటిఫికేషన్‌ను ప్రధానోపాధ్యాయులు విడుదల చేశారు. విద్యార్థుల తల్లిదండ్రుల జాబితాలో అభ్యంతరాలు ఉంటే ముందస్తుగా తెలియజేయాలన్నారు. ఈ నెల 8న మండలంలోని 8ఉన్నత, 4 ప్రాథమికోన్నత, 46 ప్రాథమిక పాఠశాలల్లో ఎన్నికలు నిర్వహించేందుకు ఏర్పాటు చేస్తున్నారు. అందులో భాగంగా తొలుత ఒక్కో తరగతికి ముగ్గురిని చొప్పున ఎన్నికుంటారు. అనంతరం ఎన్నికైన సభ్యుల నుంచి ఓటింగ్ ద్వారా చైర్మన్, వెస్ చైర్మన్లను ఎన్నుకుంటారు.

సీతారామపురం: ఆదర్శ పాఠశాలలో తల్లిదండ్రుల కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్, ఎన్నికకు గురువారం ఓ ప్రకటన విడుదల చేసినట్లు పాఠశాల ప్రిన్సిపల్ ఎస్ఎం రెహమాన్ తెలిపారు. పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి విద్యార్థుల తలిదండ్రుల జాబితాను ప్రదర్శించామన్నారు. ఈ నెల 5వ తేదీ 1గంటలోపు తల్లిదండ్రులు ఫిర్యాదు చేస్తే స్వీకరిస్తామని తదుపరి సాయంత్రం 4 గంటలకు పూర్తిస్థాయి ఓటర్ల జాబితాను ప్రకటిస్తామన్నారు. 8వ తేదీన ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సభ్యుల ఎన్నిక , అనంతరం చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక జరుగుతుందన్నారు.

కౌలు రైతులకు సీసీఆర్పీ కార్డులు

- గ్రామాల్లో అవగాహన సదస్సులు
- రుణ లక్ష్యం రూ.11.42 కోట్లు

ఆత్మకూరు, ఆగస్టు 1: సాగుచేసే రైతుల్లో ఎక్కువ మంది కౌలు రైతులు ఉన్నా.. వైసీపీ ప్రభుత్వ హయాంలో చాలా మందికి గుర్తింపు కార్డులు అందక అవస్థలు పడ్డారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మండలాల వారీగా లక్ష్యాలు నిర్దేశించి అర్హులైన కౌలురైతులందరికీ సీసీఆర్పీ (క్రాప్ కల్టివేటర్ రైట్స్ కార్డు) కార్డులు ఇవ్వాలని ఆదేశించింది. ఈ క్రమంలో వ్యవసాయశాఖ చర్యలు చేపట్టింది. కౌలురైతులకు సీసీఆర్పీ కార్డులపై అధికారులు అవగాహన కల్పించే కార్యక్రమాలను వేగవంతం చేశారు.

● ఆత్మకూరు వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలోని మూడు మండలాల్లో 3,473 హెక్టార్లలో కౌలు రైతులు పంటలు సాగు చేస్తున్నారు. వీరికి ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలు, రాయితీలు అందాలంటే పంటసాగు పత్రం(సీసీఆర్పీ) తప్పనిసరిగా ఉండాలి. ఈ కార్డు పొందాలంటే భూయజమాని అంగీకార సంతకం చేయాలి. అలా చేస్తే ఇబ్బందులు వస్తాయని పలువురు రైతులు వెనుకంజ వేస్తున్నారు. వారి అనుమానాలు నివృత్తి చేసేలా అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

● 3011 మందికి కార్డులు జారీ చేయాలని లక్ష్యం

ఆత్మకూరు మండలంలో 1101 మంది కౌలు రైతులు, ఏఎస్‌పేట మండలంలో 871 మంది, అనంతసాగరం మండలంలో 1,038 మందికి సీసీఆర్పీ కార్డులు మంజూరు చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. ఇప్పటివరకు 1,500 మందిని గుర్తించారు. కౌలు రైతులకు ఈ ఏడాదికి రూ.11.42 కోట్లు మేర రుణాలు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

ఎలా మంజూరు చేస్తారంటే...

పొలం యజమాని, కౌలురైతు ఇద్దరూ ఒప్పంద సంతకాలు చేసుకున్న తరువాత వీఆర్వో కార్డు జారీ చేస్తారు. యజమాని అందుబాటులో లేకుంటే ఆయన ధ్రువీకరించిన వ్యక్తి ఈ ఒప్పంద పత్రంలో సంతకం చేయవచ్చు. లేదా ఈ మెయిల్ ద్వారా కూడా తన అంగీకార పత్రాన్ని అందించవచ్చు.

● అర్హులందరికీ కార్డులు అందజేస్తాం: దేవసేనమ్మ, ఏడీఏ, ఆత్మకూరు

అర్హులైన కౌలు రైతులందరికీ సీసీఆర్పీ కార్డులను అందజేస్తాం. ఈ కార్డులతో భూయజమానులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని అవగాహన కల్పిస్తున్నాం. కార్డులు పొందిన వారిలో కాలపరిమితి ముగిస్తే తిరిగి పునరుద్ధరిస్తాం. భూమిని కౌలుకు తీసుకున్న రైతులు ఎప్పుడైనా అగ్రిమెంట్ చేసుకుని సీసీఆర్పీ కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవచ్చు.

పింఛన్ల పంపిణీ చారిత్రాత్మక ఘట్టం


నాగసముద్రంలో పింఛన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే కాకర్ల

కావలి, ఆగస్టు 1: రాష్ట్రంలో ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చాక చేపట్టిన పింఛన్ల పంపిణీ కార్యక్రమం దేశ చరిత్రలో చారిత్రాత్మక ఘట్టమని, ఈ ఘనత సీఎం చంద్రబాబు నాయుడికే దక్కిందని ఎమ్మెల్యే దగుమాటి క్రిష్ణారెడ్డి కొనియాడారు. పట్టణంలోని 2, 3, 18, 19 వార్డుల్లో గురువారం చేపట్టిన పింఛన్ల పంపిణీ కార్యక్ర మంలో ఎమ్మెల్యే పాల్గొని మా ట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పట్టణంలో తాగునీటి సరఫరాలోని ఇబ్బందులు తొలగించామన్నారు. రూ8 కోట్లతో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణం చేపడతామ న్నారు. కావలి-తుమ్మలపెంట రోడ్డు పనులకు సెప్టెంబరు 1న శంకుస్థాపన చేసేందుకు చర్యలు తీసుకున్నట్లు చెప్పారు.


కావలి: పింఛన్లు ఇస్తున్న ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి

● అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

అనంతరం పట్టణంలోని 19వ వార్డు అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎమ్మెల్యే తనిఖీ చేశారు. అక్కడకు సమయానికి ఉద్యోగుల రాకపోవటంతో 40 మంది పిల్లల్లో నలుగురు మాత్రమే రావ డంతో ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం జనతాపేటలోని 31వ వార్డు అర్బన్ హెల్త్‌సెంటర్ భవనాలను పరిశీలించారు. కార్యక్రమాలలో ఆర్డీవో శీనానాయక్, మున్సిపల్ కమిషనర్ జీ. శ్రావణ్ కుమార్, డీఎస్పీ వెంకట రమణ టీడీపీ పట్టణ అధ్యక్షుడు గుత్తికొండ క్రిషోర్, జ్యోతి బాబూరావు, మొగిలి కల్లయ్య, శానం హరి, ఏగూరి చంద్రశేఖర్, రమణయ్య, తోట వెంకటేశ్వర్లు, సన్నిబోయిన కమల్, బీజేపీ పట్టణాధ్యక్షుడు బ్రహ్మానందం, జనసేన పట్టణాధ్యక్షుడు పొబ్బాసాయి విఠల్ పాల్గొన్నారు.

పింఛన్‌దారుల కళ్లలో ఆనందం : ఎమ్మెల్యే కాకర్ల

కలిగిరి: ముఖ్యమంత్రి చంద్రబాబు పెంచిన పింఛను అందుకుంటున్న అవ్వతాతల కళ్లలో ఆనందం చూస్తున్నట్లు ఎమ్మెల్యే కాకర్ల సురేష్ తెలిపారు. నాగసముద్రంలో గురువారం జరిగిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రంగసుబ్బరాయుడు, మండల విస్తరణాధికారి వెలుగోటి మధు, వీఆర్వో హజరత్తయ్య, బిజ్జం కృష్ణారెడ్డి, బీవీ రామారావు, చీమల తాతయ్య, యర్రగుంట రమణారెడ్డి, నరసాల మాల్యాద్రి పాల్గొన్నారు. ఏపీ పోలీస్ హౌసింగ్ కార్పోరేషన్ మాజీ చైర్మెన్ మెట్టుకూరు చిరంజీవి రెడ్డి అనంతపురంలో జరిగిన పింఛన్ల పంపిణీలో పాల్గొన్నా రు. కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

● **అల్లూరు** : మండలంలో గురువారం చేపట్టిన పింఛన్ల పంపిణీ కార్యక్రమం 96.41 శాతం పూర్తయినట్లు ఎంపీ డీఓ జ్యోతి తెలిపారు. 264 మంది మినహా మిగిలిన వారందరికీ పింఛన్ల నగదు అందజేశామన్నారు.


లింగసముద్రంలో దివ్యాంగుడికి పింఛను అందజేస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

లింగసముద్రం: అన్నిరకాల పింఛన్లను పెంచి అందించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును ప్రతి లబ్ధిదారుడు గుర్తుంచుకోవాలని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు చెప్పారు. గురువారం లింగసముద్రం గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక ప్రసన్న వెంకటేశ్వరస్వామి, అంకమ్మతల్లి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి స్వయంగా పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన ఇటీవల వివాదానికి కారణమైన ఆర్అండ్‌బీ స్థలాన్ని పరిశీలించి ఇందులో ప్రభుత్వ స్థలమని బోర్డు ఏర్పాటు చేయాలని ఎంపీడీఓ కె శ్రీనివాసులను ఆదేశించారు. ఈ సందర్భంగా పలువురు ఆయనకు అర్జీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు వేముల గోపాలరావు, మండల తెలుగు యువత అధ్యక్షుడు అడపా రంగయ్య, గ్రామ పార్టీ అధ్యక్షుడు అడపా రంగయ్య, గ్రామ పార్టీ అధ్యక్షుడు గాలంకి ప్రసాద్, మండల తెలుగు రైతు అధ్యక్షుడు మద్దెల రామారావు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు తాళ్లూరి ముసలయ్య తదితరులు పాల్గొన్నారు.


కొండాపురం: పింఛన్ల పంపిణీలో టీడీపీ నాయకులు, సిబ్బంది

పింఛన్ల పంపిణీ 95 శాతం పూర్తి

కొండాపురం: ఎన్టీఆర్ సామాజిక భరోసా పింఛన్లు గురువారం మండలంలో 95 శాతం పంపిణీ జరిగినట్లు ఎంపీడీవో సుజాత తెలిపారు. మండలంలోని 19 పంచాయతీలకు సంబంధించి 5,457 మంది లబ్ధిదారులుండగా 5,152 మందికి నగదు పంపణీ చేశామన్నారు. మిగిలిన 305 మందికి త్వరలో అందజేస్తామన్నారు. మండల కన్వీనర్ ఎమ్.ఓంకారం పార్లపల్లి, భీమవరప్పాడు, సాయిపేట, రేణమాల గ్రామాల పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు.

బిట్రగుంట: విశ్వనాథరావుపేట పంచాయతీలోని రామస్వామిపాలెం గిరిజన కాలనీలో ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి పింఛన్ పంపిణీ చేపట్టారు. కాలనీకి చెందిన కొందరు గిరిజనులు ఎమ్మెల్యేను కలిసి, తమ సమస్యలపై ఏకరువు పెట్టారు. త్వరలో ఇళ్లు మంజూరు చేయిస్తామని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు. కాలనీలో శిథిలావస్థకు చేరిన కొన్ని ఇళ్ల మొండి గోడలను తొలగించేలా చర్యలు చేపట్టాలని అఖిల భారత మానవ హక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు దాసరి సునీల్, జిల్లా కార్యదర్శి తిరుమల, సంయుక్త కార్యదర్శి బత్తుల రవిచంద్ర కోరుతు ఎమ్మెల్యేకి వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరావు, బీజేపీ మండలాధ్యక్షుడు నూకసాని శ్రీనివాసులు యాదవ్, పిన్నిబోయిన సుధాకర్, ఎల్.సుధీర్, వేంకటేశ్వర రెడ్డి, రఘురాం నాయుడు, వెంకటేశ్వర్లు, బోగిరి ప్రభాకర్, అరుణమ్మ తదితరులు పాల్గొన్నారు.

● **కందుకూరు:** పట్టణంలోని 9వ వార్డు ఆదిఆంధ్ర కాలనీలో గురువారం ఉదయం కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పలువురు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు అందించారు. కందుకూరు అర్బన్ పరిధిలో గురువారం ఒక్కరోజే 6240 మందికి పింఛన్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కేవీ కృష్ణారెడ్డి, పార్టీ నాయకులు దామా మల్లేశ్వరరావు, పిడికిటి వెంకటేశ్వర్లు, చేవూరి రమేష్, చదలవాడ కొండయ్య, షేక్ రఫి, బెజవాడ ప్రసాదు, తదితరులు పాల్గొన్నారు.

● **వలేటివారిపాలెం** : అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయ ఉద్యోగులు తెల్లవారుజాము 5 గంటలకే లబ్ధిదారుల ఇళ్లవద్దకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. పోకూరులో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొని లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాదాల లక్ష్మీనరసింహం, లక్ష్మీనరసింహం, సోమినేని తిరుమలరావు, నల్లమోతు రవీంద్ర, గురిజాల బెంజిమెన్, నాగభూషణం పాల్గొన్నారు.

జనసేన సభ్యత్వ నమోదు

కావలి : విట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం జనసేన కార్యదర్శి సమ్మను వెంకటసుబ్బయ్య పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పునఃప్రారంభించారు. నియోజకవర్గ పవన్‌కల్యాణ్ ఫ్యాన్స్ అధ్యక్షుడు,జనసైనికులు షేక్ షమీ, జానీ, షేక్ జిలానీ, జ్యోతి, ఖలీల్, వెంకటేశ్వర్లు వెంకటేశ్వరరావు, క్రిష్ణయ్య, హనుమంతురావు పాల్గొన్నారు.

వివాదాస్పద ఆశ్రమంలో ఇంటూరి పూజలు శోచనీయం

కందుకూరు, ఆగస్టు 1: గుడ్లూరు మండలంలోని చేవూరు వద్ద ఉన్న వివాదాస్పద రామదూత ఆశ్రమంలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పూజలు చేయటం, వివిధ కార్యక్రమాలలో పాల్గొనటం శోచనీయమని హేతువాద సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నార్నె వెంకటసుబ్బయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

4న మండల సర్వసభ్య సమావేశం

కొండాపురం, ఆగస్టు 1: ఈ నెల 4న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సుజాత గురువారం తెలిపారు. మధ్యాహ్నా 2 గంటల నుంచి ఎంపీపీ బొడ్డు అనూరాధ అధ్యక్షతన మండల కార్యాలయ ఆవరణలో జరుగుతుందని మండల స్థాయి అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులందరూ తప్పక హాజరుకావాలని కోరారు

'ప్రకాశం'కు కెరీర్ 360 మ్యాగజైన్ ప్రశంసలు

కందుకూరు : కెరీర్ 360 జాతీయ మ్యాగజైన్ ఇటీవల నిర్వహించిన సర్వేలో ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాలకు అత్యుత్తమ గ్రేడ్ లభించిందని కాలేజీ కరస్పాండెంట్ కంచర్ల రామయ్య ఒక ప్రకటనలో తెలిపారు.

కూలిన అంగన్‌వాడీ కేంద్రం కిటికీ గోడ

బిట్రగుంట, ఆగస్టు 1: ముంగమూరు పంచాయతీలోని పేట గ్రామంలో నిర్మాణంలో ఉన్న అంగన్‌వాడీ ఫేస్-2 భవనం కిటికీ సైడ్ గోడ గురువారం కూలిపోవడంపై గ్రామస్తులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. నాసిరకంగా నిర్మాణం చేపట్టడం వలనే ఇలా జరిగిందని కొందరు అంటే మరికొందరు పలు రకాలుగా చర్చించుకుంటున్నారు.

సైబర్ నేరాలపై చైతన్య పరచాలి

కావలి టౌన్, ఆగస్టు 1: సాంకేతిక పరిజ్ఞానంతో సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయని వాటి నివారణకు ఐటీ విద్యార్థులు గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించి సమాజాన్ని చైతన్య పరచాలని హైదరాబాద్ ట్రాయ్ అడ్వైజర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. గురువారం విట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రిన్సిపాల్ సురేష్ అధ్యక్షతన కంజ్యూమర్ అవుట్రీట్ కార్యక్రమంలో ఆయన ట్రాయ్ సీనియర్ ఆఫీసర్ బిక్రమ్‌తో కలిసి పాల్గొని మాట్లాడారు. ప్రపంచం కమ్యూనికేషన్ వ్యవస్థపై నడుస్తుందని, ఈ వ్యవస్థతో మంచితో పాటు అంతే స్థాయిలో సైబర్ నేరగాళ్లు చెడుకు ఉపయోగిస్తున్నారని వాపోయారు. కార్యక్రమంలో ఈసీఈ విభాగాధిపతి స్రవంతి, టెలికాం డైరెక్టర్ అరవింద్, ఐటీఎస్ అడ్వైజర్ రాజు, ఆర్‌బీఐ డిప్యూటీ జీఎం వికాస్ జైస్వాల్ పాల్గొన్నారు.

కామ్రేడ్ నరసింహంకు ఘన నివాళి


కామ్రేడ్ నరసింహం మృతదేహంపై ఎర్ర కండువా కప్పి నివాళులు అర్పిస్తున్న సీపీఎం నాయకులు

గుడ్లూరు, ఆగస్టు 1: కందుకూరు డివిజన్ సీపీఎం సీనియర్ నాయకుడు, చేవూరు మాజీ సర్పంచ్ కామ్రేడ్ నూతలపాటి నరసింహం సేవలను మరువబోమని నెల్లూరు జిల్లా సీనియర్ సీపీఎం నాయకుడు ముప్పరాజు కోటయ్య అన్నారు. నూతలపాటి నరసింహం శుక్రవారం గుడ్లూరు మండలం చేవూరులో మరణించగా ఆయన మృతి విషయం తెలుసుకున్న, నెల్లూరు, ప్రకాశం జిల్లాల నాయకులు చేవూరుకు చేరుకొని ఆయనకు ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం గ్రామంలో సాగిన నూతలపాటి అంతిమయాత్రలో గ్రామస్థులతో పాటు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు పాల్గొని నివాళులు అర్పించారు. అంతిమ యాత్ర అనంతరం నరసింహం మృతదేహాన్ని ఒంగోలు కిమ్స్ వైద్యసిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రాంతాలకు చెందిన సీపీఎం నాయకులు గంటెనపల్లి వెంకటేశ్వర్లు, సుంకరి విజయలక్ష్మి, పసుపులేటి పెంచలయ్య, నూతలపాటి వెంకటేశ్వర్లు, తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వర్ల రామయ్య జన్మదిన వేడుకలో ఎస్సీ సెల్ నాయకులు


వర్ల రామయ్యకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎస్సీసెల్ నాయకులు

కలిగిరి, ఆగస్టు 1: రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు కోడూరు అఖిల్ అధ్యక్షతన మంగళగిరిలోని టీడీపీ కార్యాలయంలో గురువారం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య జన్మదిన వేడుకలో నియోజకవర్గ టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు స్వర్ణ కొండయ్య పాల్గొన్నారు. కార్యక్రమంలో నియో జకవర్గ టీడీపీ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి ఉపటూరి సుధీర్ బాబు, రాష్ట్ర ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి మాతంగి కృష్ణ జి రమేష్, ఎస్ రమేష్, రవి పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ నాయకుల ఆనందం

బిట్రగుంట, ఆగస్టు 1: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ధర్మాసనం ఇచ్చిన తీర్పుపై బోగోలులోనిఎమ్మార్పీఎస్, దళిత నేతలు సంబరాలు చేసుకున్నారు. స్థానిక బజారులోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మందకృష్ణమాదిగ చిత్రపటానికి పాలభిషేకం చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏసుపోగు జయరాజు, ఇజ్రాయేల్, బుద్దయ్య, ఫిలిప్, నవీన్, అభిషేక్, రాధయ్య, బోగిరి యోహాన్, జయరాజు పాల్గొన్నారు.

● **కావలి టౌన్ :** స్థానిక ట్రంకురోడ్డులోని బాబూ జగజ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద సంబరాలు నిర్వహించారు. అనంతరం అంబేడ్కర్, జగజ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాలు వేసి బాణసంచా కాల్చి మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో ఎంఈఎఫ్ జాతీయ అధ్యక్షుడు శ్రీనివాసులు, చేవూరు కిరణ్, మందా వెంకటేశ్వర్లు, జీ వెంకటేశ్వర్లు, కొప్పర్తి కొండయ్య, మందా మహేష్ పాల్గొన్నారు.

● **లింగసముద్రం :** సాయంత్రం లింగసముద్రంలోని తిరుమణిశెట్టి కోటయ్య మందిరం సమీపంలో పలువురు నేతలు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. బైక్ ర్యాలీ నిర్వహించారు.

ప్రైవేటు విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి : ఎస్ఎఫ్ఐ

కందుకూరు: పట్టణంలోని ప్రైవేటు విద్యాసంస్థలు, కళాశాలలు ఫిట్నెస్ లేని బస్సులు నడుపుతుండట మే గాక పరిమితికి మించి విద్యార్థులను ఎక్కించుకుంటున్నారని ఎస్ఎఫ్ఐ నెల్లూరు జిల్లా కార్యదర్శి మెండా శ్రీహర్ష గురువారం ఒక ప్రకటనలో విమర్శించారు. విద్యాసంవత్సరం మొదలై మూడు నెలలు గడుస్తున్నా ఇంతవరకు ప్రైవేటు విద్యాసంస్థల బస్సులను రవాణాశాఖ అధికారులు ఫిట్నెస్ తనిఖీలు చేయకపోవడం శోచనీయమన్నారు. ఏదైనా ప్రమాదం జరిగాక స్పందించినా ప్రయోజనం ఉండదని, తక్షణం తనిఖీలు నిర్వహించి ఫిట్నెస్ లేని బస్సులను సీజ్ చేయటంతో పాటు పరిమితికి లోబడే విద్యార్థులను తరలించేలా చర్యలు తీసుకోవాలని శ్రీహర్ష డిమాండ్ చేశారు.

తెలుగుదేశం పాలనలోనే పింఛన్లకు రూపకల్పన


తోటపల్లిగూడూరు : పింఛను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి


కోవూరు : పింఛను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

తోటపల్లిగూడూరు, ఆగస్టు 1: తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనే మాజీ ముఖ్యమంత్రి దివంగత నందమూరి తారక రామారావు పింఛన్ల పంపిణీ వ్యవస్థకు రూపకల్పన చేశారని సర్వేపల్లి ఎమ్మెల్యే, మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని కొత్తపాలెం, చింతోపు, మల్లికార్జునపురం, ఇసుకపాలెం, తోటపల్లిగూడూరు గ్రామాలలో పర్యటించి పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. కొత్తపాలెం సర్పంచ్ చేవూరు పద్మావతి, ఉపసర్పంచ్ సీరం శ్రీహరి, మాజీ సర్పంచ్ చేవూరు శ్రీనివాసులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం కొత్తపాలెంలో అసంపూర్తిగా ఉన్న పంచాయతీ భవనాన్ని త్వరితగతిన పూర్తిచేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమాలలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొమ్మి సురేంద్ర, మండల పార్టీ అధ్యక్షుడు సన్నారెడ్డి సురేష్‌రెడ్డి, ముత్యాల శ్రీనివాసులు, గోపిరెడ్డి వెంకటేశ్వర్లు, గ్రామ నాయకులు షేక్ ఖాలేషా, తదితరులు పాల్గొన్నారు.

పేదల కళ్లల్లో వెలుగు చూస్తున్నాం

కోవూరు: ప్రతినెలా ఒకటో తేదీన పింఛను చేతికందుతుండటంతో పేదల కళ్ళల్లో వెలుగు చూస్తున్నామని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. గుమ్మళ్ళదిబ్బ కాలనీలో గురువారం ఆమె ఇంటింటికీ తిరిగి పింఛన్లు పంపిణీ చేశారు. కాలనీలోని జడ్పీ హైస్కూల్‌ను పరిశీలించారు. మధ్యాహ్న భోజనం సక్రమంగా అందించాలని ఆమె సూచించారు. అనంతరం కోవూరు పట్టణంలోని దొంపలకాలువ పూడిక తీత పనుల్ని ఆమె ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీపీ తుమ్మలపెంట పార్వతి, సర్పంచు యాకసిరి విజయ, టీడీపీ నాయకులు చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి, జెట్టి రాజగోపాలరెడ్డి, దువ్వూరు కళ్యాణ్‌రెడ్డి, బాలరవి తదితరులు పాల్గొన్నారు. కాగా, కోవూరు సచివాలయాల్లో కుసుమలత, నాటకరాని వెంకట్, మన్నేపల్లి శంకర్, లేగుంటపాడులో జెట్టి రాజగోపాలరెడ్డి, మోడే గుంటలో దాసరి మురళీమోహన్, ఇనమడుగులో కొల్లారెడ్డి సుధాకరరెడ్డి, పోతిరెడ్డి పాళెంలో తిరుమూరు అశోక్‌రెడ్డి ఆధ్వర్యంలో పింఛన్లు పంపిణీ చేశారు.

● **వెంకటాచలం:** మండలంలోని అన్ని గ్రామాల్లో గురువారం ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ పండగలా జరిగింది. అనికేపల్లిలో టీడీపీ మండలాధ్యక్షుడు గుమ్మడి రాజాయాదవ్, గొలగమూడిలో టీడీపీ సీనియర్ నేత కొర్రకూటి పార్థసారధినాయుడు, బొనిగల దామోదర్, మనోహర్, వెంకటేశ్వర్లు, సుబ్బరామయ్య, రామదాసుకండ్రిగలో టీడీపీ నేత చాట్ల వెంకటసుబ్బయ్యతోపాటు ఆయా గ్రామాల్లోని టీడీపీ నేతలు, సచివాలయ సిబ్బందితో కలిసి పింఛన్ల పంపిణీ కార్యక్రమం చేపట్టారు.

● **మనుబోలు:** మండలంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లను గురువారం 96శాతం పంపిణీ చేసినట్లు మండల పరిషత్ కార్యాలయం ఏవో రవికుమార్‌రెడ్డి తెలిపారు. సచివాలయ, విఆర్‌ఏ, విఆర్‌వో, కార్యదర్శులు, అంగన్‌వాడీ సిబ్బంది కలిసి 5559మందికి పింఛన్లు అందించారని మిగిలిన 4శాతం పింఛన్లను శుక్రవారం సాయంత్రం కల్లా పంపిణీ చేసేలా చర్యలు తీసుకున్నామన్నారు.

● **బుచ్చిరెడ్డిపాళెం:** బుచ్చి నగర పంచాయతీతోపాటు, మండలంలో గ్రామాలలో లబ్ధిదారుల ఇళ్లవద్దకు సచివాలయ, తదితర ఉద్యోగులు వెళ్లి పింఛన్లు అందజేశారు. దీంతో లబ్ధిదారుల్లో ఆనందం వెల్లివిరిసింది.

తల్లిపాలు బిడ్డకు శ్రేష్ఠం


పొదలకూరు: మాట్లాడుతున్న సీడీపీవో విజయలక్ష్మీ

పొదలకూరు, ఆగస్టు 1: మండలంలోని కనుపర్తి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం అట్టహాసంగా ప్రారంభించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న వెంకటాచలం సీడీపీఓ విజయలక్ష్మీ తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ జ్యోతిలక్ష్మీ, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

● **బుచ్చిరెడ్డిపాళెం:** మండలంలోని మునులపూడి పంచాయతీ రెడ్డిపాళెంలోని అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం సూపర్‌వైజర్ ఆధ్వర్యంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గర్భిణులు, బాలింతలు, స్కూలు హెచ్‌ఎం, గిరిజ, ఎమ్మెస్కే సౌందర్య, అంగన్‌వాడీ వర్కర్లు, వెంకటరమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

● **మనుబోలు :** అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈనెల 7వ తేదీ వరకు తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమణమ్మ తెలిపారు. తొలిరోజు పిడూరు పంచాయతీలోని సీతారామపురం గిరిజనకాలనీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలపై ర్యాలీ నిర్వహించారు. తల్లిపాల విశిష్టత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కార్యకర్తలు ఆశం సుబ్బమ్మ, కృష్ణవేణి, మహాలక్ష్మీ, విజయమ్మలు పాల్గొన్నారు.

పేదల సంక్షేమం టీడీపీతోనే సాధ్యం

కొడవలూరు, ఆగస్టు 1: పేదల సంక్షేమం టీడీపీతోనే సాధ్యమని, ఆ దిశగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని జిల్లా మాజీ గ్రంధాలయ సంస్థ చైర్మన్ మందిపాటి ప్రవీణ్ కుమార్ రెడ్డి అన్నారు. నార్త రాజుపాళెంలో గురువారం ఆయన పింఛన్లు పంపిణీ చేశారు. ఆయన వెంట టీడీపీ నాయకులు పాటూరు రమేష్, నాసిన ప్రసాద్, తువ్వర ప్రవీణ్, సిదార్థ, బాబీ తదితరులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు తోపుడు బండ్లు పంపిణీ

నెల్లూరు,(స్టోన్‌హౌస్‌పేట), ఆగస్టు 1: చిరు వ్యాపారులందరికీ తోపుడుబండ్లు ఇస్తామని రాష్ట్ర పట్టణాభివృద్ధి శాఖామంత్రి పొంగూరు నారాయణ హామీ ఇచ్చారు. నగరంలోని గోమతినగర్‌లోని మంత్రి కార్యాలయంలో గురువారం రాత్రి చిరు వ్యాపారులకు తోపుడు బండ్లను అందజేశారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ ఆగస్టు 1వ తేదీ చాలా మంచి రోజు అని, అందుకే ఉదయం ఆరు నుంచే పెన్షన్‌ల పంపిణీ చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. ఒక్క రోజులోనే 98 శాతం పూర్తి చేయడం గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కపిరి రేవతి, తదితరులు పాల్గొన్నారు.

కామాక్షితాయికి ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి పూజలు


కామాక్షితాయికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం, ఆగస్టు 1: మండలంలోని జొన్నవాడ మల్లికార్జునస్వామి, కామాక్షితాయి ఆలయంలో ఆషాడ మాసం సందర్భంగా గురువారం ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి అమ్మవారికి ఆషాడమాస సారె సమర్పించారు. ఆలయ మర్యాదలతో ఆమెకు కార్యనిర్వహణాధికారి ఏవీ శ్రీనివాసులురెడ్డి, అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కాగా, తమకు రెండు నెలలుగా జీతాలు ఇవ్వలేదని ఉద్యోగులు ఆమెకు విన్నవించుకున్నారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే వచ్చే నెలనుంచి ఎప్పటిలాగానే జీతాలు ఇచ్చేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు హరికృష్ణ, ఎంవీ శేషయ్య, శ్రీనివాసులురెడ్డి, ఉమ్మయ్యస్వామి, కె. పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సకాలంలో సర్టిఫికెట్లు అందించాలి

● వర్సిటీ ఇన్‌చార్జ్ వీసీకి టీఎన్‌ఎస్‌ఎఫ్ నేతల వినతి


వినతిపత్రం ఇస్తున్న టీఎన్‌ఎస్‌ఎఫ్ నేతలు

వెంకటాచలం, ఆగస్టు 1: విద్యార్థులకు సకాలంలో సర్టిఫికెట్లు అందించాలని టీఎన్‌ఎస్‌ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు వసీమ్, మండలాధ్యక్షుడు నలబాలపు వెంకటాద్రి కోరారు. మండలంలోని వీఎస్‌యూలో గురువారం ఇన్‌చార్జ్ వీసీ డాక్టర్ సారంగం విజయభాస్కర్‌రావును టీఎన్‌ఎస్‌ఎఫ్ నేతలు కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు సర్టిఫికెట్లు అందించడంలో తీవ్ర జాప్యం జరుగుతోం దన్నారు. ఏళ్ల తరబడి విద్యార్థులు వర్సిటీ చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇకనైనా స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో టీఎన్‌ఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి హేమంత్, నేతలు అశోక్, సురేష్, మహేష్ తదితరులున్నారు.

జర్నలిస్టులపై దాడులు చేస్తే సహించం



కొత్తకమిటీతో జేఏసీ నాయకులు

మనుబోలు, ఆగస్టు 1: జర్నలిస్టులపై దాడులు చేస్తే సహించేది లేదని గూడూరు డివిజన్ ప్రింట్ అండ్ మీడియా జాయింట్ యాక్షన్ కమిటీ అధ్యక్షుడు మీజూరు మల్లికార్జునరావు హెచ్చరించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో గురువారం జేఏసీ కమిటీ నాయకుడు గుంజేపల్లి బాబుమోహన్‌దాస్ అధ్యక్షతన మండల జర్నలిస్టులతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా మీజూరు మాట్లాడుతూ జర్నలిస్టులంతా ఐకమత్యంగా ఉండి సమస్యలు సాధించుకోవాలన్నారు. జర్నలిస్టుల రక్షణ కోసమే కమిటీ ఏర్పాటు చేస్తున్నామన్నారు. అనంతరం కొత్త కమిటీని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గూడూరు జేఏసీ కమిటీ నాయకులు జమాలుల్లా, శరత్, శివ, లక్ష్మణ్, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

కాగితపు బొమ్మల తయారీ పోటీలు


పేపరుతో చేసిన కళారూపాలు చూపుతున్న విద్యార్థులు

నెల్లూరు (సాంస్కృతికం) : గురువారం కాగితపు దినోత్సవం సందర్భంగా నగరంలో వివిధ పాఠశాలల్లో విద్యార్థులకు కాగితపు బొమ్మల తయారీ పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ పోటీలను కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ సమాచార అధికారి నాగసూరి, పేపర్ మర్చంట్స్ అసోసియేషన్, శ్రీశ్రీ ఏజెన్సీస్‌లు సంయుక్తంగా నిర్వహించాయి. 20 మంది విజేతలను ఎంపిక చేసి త్వరలో బహుమతి ప్రదానం చేస్తామని నిర్వాహకులు తెలిపారు. ప్రజల జీవితాల్లో భాగమైన కాగితం అనేక రూపాల్లో జీవరాశికి ఉపయోగపడుతుందని జిల్లా కలెక్టర్ ఆనంద్, జేసీ సూర్యతేజ శుభాకాంక్షలు తెలిపారు.

'మైనార్టీలను మోసం చేసిన ఆదాల'

నెల్లూరు (సాంస్కృతికం): మాజీ ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి మైనార్టీలను మోసం చేశారని ఖాదర్‌నవాజ్ ఖాన్ ఈద్గా కమిటీ సభ్యులు ఆరోపించారు. గురువారం సాయంత్రం కొత్తూరులో వారు విలేకరులతో మాట్లాడారు. తన అల్లుడి కోసం ఆదాల ఈద్గా స్థలంలో పెట్రోలు బంకు ఏర్పాటుకు కుట్రలు చేసి, ఆ కుట్రలను రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి చేయిస్తున్నట్లు నమ్మించారని పేర్కొన్నారు. కొత్తూరు సుజాతమ్మ కాలనీలోని ప్రభుత్వ స్థలంలో ఖాదర్‌నవాజ్‌ఖాన్ దర్గాను నిర్మించుకుని పూజలు చేస్తుంటే, దాన్ని ఖాళీ చేసేందుకు ఆదాల అధికారుల చేత ఒత్తిళ్లు చేయిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో దర్గా కమిటీ సభ్యులు ఆషిక్ అలీఖాన్, జమీర్, రఫీ, రియాజ్, ఖయ్యుం, తదితరులు పాల్గొన్నారు.

డైవర్షన్‌ల వద్ద సిగ్నల్ లైట్లు ఏర్పాటు చేయాలి

నెల్లూరు (సాంస్కృతికం): నగరంలోని మినీబైపాస్‌రోడ్డులో డైవర్షన్‌ల వద్ద రాత్రిళ్లు సిగ్నల్ లైట్లు ఏర్పాటు వేయించాలని ఏ వన్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు అళహరి వెంకటేష్ మంత్రి నారాయణకు వినతిపత్రం అందచేశారు. రాత్రిళ్లు డైవర్షన్‌లు, క్రాసింగ్‌లు కన్పించక ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఆ ప్రాంతాల్లో ఎరుపు లైట్లు వేయించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

నేడు శాకాంబరి అలంకారం

నెల్లూరు (సాంస్కృతికం) : ఆషాఢమాసం సందర్భంగా వాసవీ కన్యకాపరమేశ్వరికి శుక్రవారం శాకాంబరి అలంకారం జరగనున్నది. ఈ కార్యక్రమాన్ని ఆలయ ధర్మకర్తల సహకారంతో నెల్లూరు వాసవీ క్లబ్ సిటీ ఏర్పాటు చేస్తున్నది. ఉదయం 8గంటల కల్లా అలంకరణ పూర్తి చేసి దర్శనం కల్పించనున్నారు.

నెల్లూరు సిటీ, రూరల్ కోవూరు, సర్వేపల్లి

బీసీజీ వ్యాక్సినేషన్ తనిఖీ

నెల్లూరు(వైద్యం) ఆగస్టు 1: నగరంలోని మల్లిఖార్జునపురం, చాకలివీధిల్లోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కొండదిబ్బ, మండపాలవీధి సచివాలయాల పరిధిలో గురువారం నిర్వహించిన బీసీజీ వ్యాక్సినేషన్‌ను వైద్యాధికారులు తనిఖీ చేశారు. వయోజనులకు వ్యాక్సిన్ వేసే కార్యక్రమాన్ని జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ ఖాదర్‌వలి, రాష్ట్ర బీసీజీ వ్యాక్సిన్ పరిశీలకుడు డాక్టర్ అరుణకుమారి పరిశీలించారు. ఈ సందర్భంగా ఖాదర్‌వలి వ్యాక్సిన్ అవసరమైన వారిని వైద్యసిబ్బంది గుర్తించి వ్యాక్సిన్ వేయాలని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో డీసీపీ విజయకుమార్, డాక్టర్ ప్రతిమ, డాక్టర్ గీతాంజలి, కమ్యూనిటీ ఆర్గనైజర్ తిరుపతయ్య, మధు, రామలక్ష్మి, సునీత పాల్గొన్నారు.

కలివెలపాళెంలో...

నెల్లూరురూరల్ : మండలంలోని కలివెలపాళెంలో బీసీజీ వ్యాక్సిన్‌ను రాష్ట్ర పరిశీలకురాలు డాక్టర్ అరుణకుమారి గురువారం పరిశీలించారు. అదనపు వైద్యాధికారి డాక్టర్ ఖాదర్‌వలి, డీఆర్‌టీటీ కోఆర్డినేటర్ డాక్టర్ శ్రావణ్‌కుమార్‌లతో కలిసి ఇంటింటికి వెళ్లి ఆరా తీశారు. అనంతరం ఫ్యామిలీ ఫిజిషియన్ వైద్య శిబిరాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో అల్లీపురం పీహెచ్‌సీ వైద్యుడు బలరామనాయక్ తదితరులు పాల్గొన్నారు.



నగరంలో బీసీజీ వ్యాక్సినేషన్‌ను తనిఖీ చేస్తున్న వైద్యాధికారులు, కలివెలపాళెంలో వ్యాక్సినేషన్‌పై ఆరా తీస్తున్న అధికారులు

చంద్రబాబుతోనే వర్గీకరణ సాధ్యం


కేక్ కట్ చేసి ఆనందం పంచుకుంటున్న నాయకులు

నెల్లూరు(హరనాథపురం); ఆగస్టు 1 : సీఎం చంద్రబాబుతోనే ఎస్సీ వర్గీకరణ సాధ్యమని మాదిగ ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపాక మస్తానయ్య అన్నారు. గురువారం నగరంలోని బాబు జగ్జీవన్‌రామ్ భవన్‌లో మాదిగ ఉద్యోగుల ఆత్మీయ సమావేశం జరిగింది. కేక్‌కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో మాదిగల అభివృద్ధి ఎస్సీ వర్గీకరణతోనే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రవిప్రసాద్, వెంకట్రావు మాదిగ, పి. శ్రీనివాసులు, హజరత్తయ్య, పాయ్య, జయరాజ్ తదితరులు పాల్గొన్నారు.

● **వేదాయపాళెం సెంటర్‌లో...**

వేదాయపాళెం సెంటర్‌లో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి జెన్ని రమణయ్య మదిగ, కార్పొరేటర్ బద్దెపూడి నరసింహగిరి మాదిగ ఆధ్వర్యంలో డాక్టర్ బాబు జగజ్జీవన్‌రామ్ విగ్రహానికి పాలభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్గీకరణపై తీర్పు ఇచ్చిన సుప్రీంకోర్టుకు కృతజ్ఞతలు తెలిపారు.

● **తీర్పు చారిత్రాత్మకం**

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట) : సుప్రీంకోర్టు ధర్మాసనం ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా చారిత్రాత్మకు తీర్పునిచ్చిందని బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బైరి శ్రీనివాస్ పేర్కొన్నారు. నగరంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గతంలో ముగ్గురు సభ్యుల ధర్మాసనం ఇచ్చిన తీర్పును కొట్టివేస్తూ, రాజ్యాంగంలోని 14వ అధికరణ ద్వారా ఎస్సీ కులాల ఉపవర్గీకరణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయవచ్చని స్పష్టమైన తీర్పు నివ్వడం జరిగిందన్నారు. తీర్పునిచ్చిన నేపథ్యంలో ప్రధాన మోదీకి, న్యాయమూర్తులకు ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు.

గణేష్ ఉత్సవాలకు అన్నీ ఏర్పాట్లు చేయండి : నారాయణ


గణేష్ ఘాట్‌ను పరిశీలిస్తున్న మంత్రి నారాయణ, ఎమ్మెల్యే కోటంరెడ్డి, తదితరులు

నెల్లూరు (సాంస్కృతికం) ఆగస్టు 1 : సెప్టెంబరులో జరిగే గణేష్ ఉత్సవాలు, నిమజ్జనంకు అన్నీ ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖామంత్రి పొంగూరు నారాయణ అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం ఆయన నగరంలోని నెక్లెస్‌రోడ్డు, గణేష్‌ఘాట్, నెల్లూరు చెరువులను సందర్శించి. పరిశీలించారు. మరో ఆరు నెలల్లో ఎన్టీఆర్ నెక్లెస్ రోడ్డును సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతామన్నారు. గణేష్ ఉత్సవాల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్నీ చర్యలు తీసుకోవాలని కోరారు. నెక్లెస్‌రోడ్డుకి ఇరువైపులా చిల్డ్రన్స్ పార్కు, తరహాలో పచ్చనిచెట్లు, ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు ప్రణాళికలు తయారు చేస్తున్నామని తెలిపారు. గణేష్ ఉత్సవాలు, నిమజ్జనంపై రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, కమిషనర్ సూర్యతేజకు సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నుడా ఉపాధ్యక్షుడు బాపిరెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎస్. వంశీధర్‌రెడ్డి, నాయకులు మండ్ల ఈశ్వరయ్య, యశ్వంగ్ సింగ్, గడ్డం విజయ్‌కుమార్, ఏవీఆర్ మోహన్‌రావు, ఉచ్చి భువనేశ్వర ప్రసాద్, విక్రమ సింహపురి గణేష్ ఉత్సవ సమితి నాయకులు, మున్సిపల్ సిబ్బంది, అధికారులు, టీడీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన కోవూరు ఎమ్మెల్యే

నెల్లూరు(క్రైం), ఆగస్టు 1: కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి గురువారం పోలీసు క్యాంపు కార్యాలయంలో ఎస్పీ కృష్ణకాంత్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో శాంతి భద్రతల పరిరక్షణ, మైపాడు బీచ్ వద్ద సెలవు దినాల్లో అదనపు భద్రతపై ఎస్పీతో చర్చించారు. కోవూరులో మహిళల సంరక్షణకు తక్షణమే స్పం దించేలా కింది స్థాయి పోలీసు అధికారులను ఆదేశించాలని కోరారు. రాత్రి వేళల్లో గస్తీ పెంచాలని కోరారు. ఆమె వెంట టీడీపీ నాయకులు దువ్వూరు కళ్యాణ్‌రె డ్డి, కోడూరు కమలాకర్‌రెడ్డి, బెజవాడ వంశీకృష్ణారెడ్డి, జెట్టి రాజగోపాల్‌రెడ్డి, మదన్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి తదితరులు ఉన్నారు.

నారాయణలో సీఈవో పునీత్ పుట్టినరోజు వేడుకలు


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసులురెడ్డి

నెల్లూరు (వైద్యం) : నారాయణ వైద్య కళాశాలలో నారాయణ విద్యాసంస్థల సీఈవో పునీత్ పుట్టినరోజు వేడుకలు గురువారం జరిగాయి. వైద్య కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులురెడ్డి, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హరిప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో వైద్యులు కేక్‌కట్ చేసి అంద రికీ పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో నారాయణ డెంటల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అజయ్ రెజినాల్డ్, నారాయణ ఆపరేషన్స్ హెడ్ రామారావు , సీఎఫ్‌వో సురేష్, నారాయణ నర్సింగ్ కళాశాల డీన్ డాక్టర్ ఇందిరా, ఏజీఎం శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా పింఛన్ల పంపిణీ

నెల్లూరు(వైద్యం) ఆగస్టు 1 : టీడీపీ బీసీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధర్మవరం సుబ్బారావు గురువారం పింఛన్లు పంపిణీ చేశారు. 47వ డివిజన్‌లోని పింఛన్‌దారులకు ఆయన నగదు అందచేశారు. ఆయన మాట్లాడుతూ మంత్రి నారాయణ ఆదేశాల మేరకు పింఛన్ల పంపిణీ చేపడుతున్నామని చెప్పారు. కార్యక్రమంలో 47వ డివిజన్ ఇన్‌చార్జి డాక్టర్ గణేష్‌కుమార్, నేతలు కలవకుంట్ల భాస్కర్, మణికుమార్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

● **నెల్లూరురూరల్ :** నియోజకవర్గం పరిధిలోని అల్లీపురంలో గురువారం పేదలకు పింఛన్లను, టీడీపీ సీనియర్ నేత పోలూరు సుబ్బయ్య పంపిణీ చేశారు. సచివాలయ సిబ్బందితో కలిసి ఇంటింటికి వెళ్లిన ఆయన పింఛను నగదును అందించారు. నూటికి నూరు శాతం పింఛన్లు ఒక్క రోజుల్లో అందించాలన్న లక్ష్యంతో పని చేస్తున్నామన్నారు.

తల్లిపాలే బిడ్డకు సంజీవని లాంటివి

నెల్లూరు(వైద్యం) ఆగస్టు 1 : తల్లిపాలే బిడ్డకు సంజీవని లాంటివని జీజీహెచ్ అడినల్ సూపరింటెండెంట్, చిన్నపిల్లల విభాగం హెచ్‌వోడీ డాక్టర్ జయచంద్ర నాయుడు తెలిపారు. గురువారం చిన్నపిల్లల విభాగంలో తల్లిపాల వారోత్సవాలు జరిగాయి. తల్లిపాల ప్రాధాన్యతను గుర్తించి బిడ్డకు పాలివ్వాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి డాక్టర్ శివరాముడు డాక్టర్ సురేష్‌బాబు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరురూరల్ : వ్యాధినిరోధక శక్తి పెంపొందాలంటే పుట్టినబిడ్డకు ఆరు మాసాల వరకు కచ్చితంగా తల్లిపాలు ఇవ్వాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం స్వరూప అన్నారు. తల్లిపాల వారోత్సవాలలో భాగంగా గురువారం టైలర్స్‌కాలనీ వద్ద గర్భిణీలు, బాలింతలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయమ్మలు పాల్గొన్నారు.

నగరాభివృద్ధిపై దృష్టి పెట్టండి : మంత్రిని కోరిన జనసైనికులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), ఆగస్టు 1: రాష్ట్ర మంత్రిగా ఎంతో బిజీగా ఉన్నా నెల్లూరు నగరాభివృద్ధిపై దృష్టి పెట్టాలని మంత్రి పొంగూరు నారాయణను జనసేన పార్టీ జిల్లా నాయకులు కోరారు. కార్పొరేషన్ కార్యాలయంలో గురువారం ఆయన్ను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా జనసేన కోర్ కమిటీ సభ్యుడు నూనె మల్లికార్జున యాదవ్ మాట్లాడుతూ నగరంలోని రోడ్లు ఆక్రమణలతో నిండాయని, పారిశుధ్యం అధ్వానంగా ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉప్పెనలా రావాలి : జనసేన సభ్యత్వ నమోదుకు జనసైన్యం ఉప్పెనలా తరలిరావాలని నూనె మల్లికార్జున పిలుపునిచ్చారు. నగరంలోని ఆమని గార్డెన్స్‌లో గురువారం జనసేన సభ్యత్వ నమోదును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర రాజకీయాల్లో జనసేన పార్టీ చరిత్ర సృష్టించేలా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.



రిజిస్టర్ కాని ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఎన్ని?

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 1 : నెల్లూరులో రిజిస్టర్ కాని ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఎన్ని ఉన్నాయి... వాటిని రిజిస్ట్రేషన్ చేసుకునేలా ప్రోత్సాహించడానికి ప్రభుత్వం తీసుకున్న చర్యలేమిటో వివరించాలని గురువారం లోక్‌సభలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నించారు. ఇందుకు కేంద్ర మంత్రి రవ్‌నీత్‌సింగ్ లిఖితపూర్వక సమాధానమిస్తూ ఏపీలో రిజిస్టర్ కాని ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు 1,54,330 ఉన్నాయని తెలిపారు. ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో పెట్టుబడులను ప్రోత్సాహించడానికి కేంద్రం కృషి చేస్తున్నదని ఆయన తెలిపారు.

చంద్రబాబుతో శరత్‌చంద్రారెడ్డి భేటీ


చంద్రబాబుకు తిరుమల ప్రసాదం అందజేస్తున్న శరత్‌చంద్రారెడ్డి

నెల్లూరు(వ్యవసాయం), ఆగస్టు 1: సీఎం చంద్రబాబుతో పారిశ్రామికవేత్త మాగుంట శరత్ చంద్రారెడ్డి గురువారం అమరావతిలోని సచివాలయంలో భేటీ అయ్యారు. జిల్లాలో పరిశ్రమల ఏర్పాటు, యువతకు ఉద్యోగ అవకాశాలపై సీఎంతో చర్చించారు. పరిశ్రమల ఏర్పాటుకు తనవంతు సహాయ సహకారాలు అందిస్తామని, పలు విదేశీ కంపెనీలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధంగా ఉన్నాయని సీఎం తనతో అన్నారని ఆయన పేర్కొన్నారు.

బూదాటికి అభినందనలు


నెల్లూరు(వ్యవసాయం), ఆగస్టు 1 : అఖిల భారత పద్మశాలి సంఘం చేనేత విభాగం అధ్యక్షుడిగా మాజీ ఎమ్మెల్సీ బూదాటి రాధాకృష్ణయ్య ఎంపికయ్యారని, వారికి అభినందనలు తెలియజేస్తున్నట్లు చేనేత ఐక్య కార్యాచరణ కమిటీ జిల్లా అధ్యక్షుడు బుధవరపు బాలాజీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

4న కళాంజలి సంగీత సంబరం

నెల్లూరు (సాంస్కృతికం): నగరంలోని పురమందిరంలో ఈనెల 4న కళాంజలి సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో 37వ సంగీత సంబరం నిర్వహించనున్నట్లు కళాంజలి వ్యవస్థాపకుడు అనంత్, గానం అకాడమీ డైరెక్టర్ ఎం.లక్ష్మీప్రసన్న, కమిటీ సభ్యుడు నాతా కృష్ణకుమార్ తెలిపారు. గురువారం గానం కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. ఈనెల 4న ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జూనియర్, సీనియర్ విభాగాల్లో పాటల పోటీలు జరుగుతాయన్నారు. అన్నమయ్య సంకీర్తనలతో పాటు సినీగీతాలు పాడవచ్చని తెలిపారు. సాయంత్రం 6 గంటలకు స్వరఝరి, అనంతరం కళాంజలి అవార్డుల ప్రదానం ఉంటుందని తెలిపారు.

గ్రంథాలయం పునఃనిర్మాణాన్ని పూర్తి చేయండి

నెల్లూరు (సాంస్కృతికం) : నగరంలోని గుర్రం జాషువా గ్రంథాలయం పునఃనిర్మాణ పనులు పూర్తి చేయించాలని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణకు గ్రంథాలయ వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్.ఖాసిం, కమిటీ సభ్యులు వినతిపత్రం అందజేశారు. గురువారం కార్పొరేషన్ కంట్రోల్ రూమ్‌లో పట్టణ ప్రణాళిక శాఖ సమీక్ష సమావేశంలో మంత్రి కలిసి విన్నవించారు. ఎన్నికల కోడ్ కారణంగా పనులు ఆగిపోయాయని వాటిని పునఃప్రారంభం చేయించాలని కోరారు. అధికారులతో చర్చించి గ్రంథాలయ పునఃనిర్మాణ పనులు పూర్తి చేయిస్తానని మంత్రి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, కమిషనర్ సూర్యతేజ, నుడా ఉపాధ్యక్షుడు బాపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



లోకేశ్ అన్నా...

పేద పిల్లల ఆకలి తీర్చండి



- ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో మధ్యాహ్న భోజనం కోసం ఎదురుచూపులు
- ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 23వేల మంది విద్యార్థులకు లబ్ధి

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో తిరిగి మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభిస్తారనే ఆశతో పేద విద్యార్థులు ఎదురు చూస్తున్నారు. తెలుగుదేశం ప్రభుత్వంలో అమలులో ఉన్న ఈ పథకాన్ని 2019లో అధికారంలోకి రాగానే జగన్ రద్దు చేసేశారు. పేద పిల్లలు చదువుకునే ప్రభుత్వ కాలేజీల్లో ఈ పథకం తిరిగి ప్రారంభిస్తామని యువగళం పాదయాత్రలో లోకేష్ హామీ కూడా ఇచ్చారు.

- తిరుపతి(విద్య)



62 కళాశాలల్లో 23వేల మంది

ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 66 మండలాల్లో 62 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. వీటిలో ఏటా సుమారు 23 వేలమంది విద్యార్థులు ఇంటర్ చదివేవారు. సాధారణంగా ప్రభుత్వ కళాశాలల్లో ఎక్కువగా పేద,మధ్య తరగతి కుటుంబాలు, ఎస్సీ ఎస్టీ బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన విద్యార్థులు చదువుతుంటారు. కనీసం లంచ్ బాక్స్ తెచ్చుకోలేనివారు వీరిలో చాలామంది ఉంటారు. దీనికితోడు వీరు దాదాపు 20 కిలోమీటర్ల దూరం నుంచి కూడా కళాశాలలకు వస్తుంటారు. దీంతో కళాశాల సమయంకంటే గంట, లేక రెండు గంటల ముందే ఇళ్లనుంచి బయల్దేరుతారు. అల్పాహారమో, లేక చద్దన్నమో తినేసి ఇళ్లనుంచి కళాశాలలకు చేరుకునే విద్యార్థులు మళ్లీ సాయంత్రం ఇళ్లకు చేరేవరకు ఆకలితోనే చదువులు సాగిస్తారు. ఇప్పుడు నారా లోకేష్ రాష్ట్ర విద్యాశాఖా మంత్రి కావడంతో అటు విద్యార్థులతోపాటు ఇటు అధ్యాపకులు సైతం ప్రభుత్వంవైపు ఆశగా చూస్తున్నారు. జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని అధ్యాపకులు, విద్యార్థులు కోరుతున్నారు.

పేద పిల్లలకు ఇది అవసరం

మధ్యాహ్న భోజనం లేనందువల్ల హాజరు శాతం తగ్గుతోంది. కొంతమంది మధ్యాహ్న భోజనంకోసం ఇళ్లకు వెళ్లినవారు తిరిగి కళాశాలలకు రావడంలేదు. అలాగే డ్రాపౌట్స్ కూడా పెరుగుతున్నారు. మధ్యాహ్న భోజనం అమలుచేస్తే ప్రభుత్వ కళాశాలల్లో ప్రవేశాలు పెరుగుతాయి.

- రవి, జూనియర్ లెక్చరర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు



మా ఆకలి తీర్చండి

ఉదయం కళాశాలకు వచ్చినప్పటినుంచి సాయంత్రం ఇంటికి వెళ్లేవరకు భోజనం లేకుండా ఆకలితో ఉండాల్సి వస్తోంది. దీంతో చదవుపై దృష్టి సారించలేకపోతున్నాం. మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తే పేద, గ్రామీణ విద్యార్థులకు ఎంతో మేలు చేసినవారవుతారు.

- ఏఎస్ మోహన్‌కుమార్, ఎంపీసీ ద్వితీయ, పుత్తూరు



చాలామంది బాక్స్‌లు తెచ్చుకోలేరు

చుట్టుపక్కల గ్రామాల నుంచి కళాశాలకు వచ్చే విద్యార్థుల్లో చాలామంది లంచ్ బాక్స్‌లు తెచ్చుకునే పరిస్థితి లేదు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఏమీ తినకుండా ఉండాలంటే కష్టంగా ఉంటోంది. మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తే చాలా బాగుంటుంది.

- వినయ్‌కుమార్, సీఈసీ ద్వితీయ, చంద్రగిరి



ఒకరోజు తింటే.. మరో రోజు పస్తు

ప్రతి రోజూ ఇంటి నుంచి భోజనం తెచ్చుకోలేం.దీంతో మధ్యాహ్నం ఒకరోజు తింటున్నాం.. మరో రోజు పస్తు ఉంటున్నాం. డబ్బులు ఉంటే హోటళ్లలో తినేది, లేదంటే మానుకునేది. ఆకలేసినా మళ్లీ సాయంత్రం ఇంటికి వెళ్లేవరకు ఉండక తప్పదుకదా.

- ఎం. సూర్యాచారి, ఐసీఎస్ఈ ఒకేషనల్, చంద్రగిరి



చిన్నారిపై వృద్ధుడి లైంగిక దాడి

- నిందితుడిపై పోక్సో కేసు నమోదు

ఓజిలి, ఆగస్టు 1: ఓ చిన్నారిపై వృద్ధుడు లైంగిక దాడి చేశాడు. నిందితుడిపై పోక్సో కేసు నమోదైంది. ఓజిలి ఎస్ఐ రవిబాబు తెలిపిన వివరాల మేరకు.. ఒకటో తరగతి చదువుతున్న గిరిజన బాలిక (6) తన తమ్ముడు కనిపించలేదని సమీపంలోని పొలాల వద్దకు బుధవారం మధ్యాహ్నం వెళ్లింది. ఆ సమయంలో మద్యం తాగి అటుగా వస్తున్న ఈశ్వరయ్య (60) చిన్నారికి డబ్బులు ఆశచూపి చెట్టుకిందకు తీసుకెళ్లాడు. ఆపై లైంగిక దాడి చేయడంతో చిన్నారి భయపడి కేకలు పెడుతూ పాఠశాల వద్దకు పరుగులు తీసింది. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఈ విషయాన్ని ఎంఈవో శైలజకు తెలియజేశారు. ఆమె వెంటనే పాఠశాల వద్దకొచ్చి ఎస్ఐకి ఫిర్యాదు చేశారు. ఆయన పూర్తి వివరాలను సేకరించి వృద్ధుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు గురువారం మీడియాకు తెలిపారు.

నేడు డయల్ యువర్ టీటీడీ ఈవో

తిరుమల, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): టీటీడీ ఈవోగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన శ్యామలరావు తొలిసారిగా డయల్ యువర్ ఈవో కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. తిరుమలలోని అన్నమయ్య భవనంలో శుక్రవారం ఉదయం 9 నుంచి 10 గంటల వరకు ఈకార్యక్రమం జరగనుంది. భక్తులు తమ సందేహాలు, సూచనలు, ఫిర్యాదులపై నేరుగా టీటీడీ ఈవోతో మాట్లాడవచ్చు. దీనికోసం 0877 2263261 నెంబరుకు ఫోన్ చేయాలి.

ప్రైవేటు ల్యాబుల దందా

- రోగులను దోచేస్తున్నారు
- గత ప్రభుత్వ హయాంలో పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చాయి



మారుమూల ప్రాంతాల్లో నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న ప్రైవేటు ల్యాబులు

జిల్లాలో డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్, డయేరియా కేసులు ప్రబలుతున్నాయి. వీటితోపాటు జలుబు, దగ్గు వంటివి వచ్చి ప్రైవేటు వైద్యుల దగ్గరకు వెళితే వైద్య పరీక్షలు చేయించుకోవాల్సిందే. అందువల్ల కార్పొరేట్ ఆస్పత్రులు మొదలు ఆర్ఎంపీ క్లినిక్‌ల వరకు ప్రతి ఒక్కరూ తమకు అనుసంధానంగా ప్రైవేటు ల్యాబులు ఏర్పాటు చేసుకున్నారు. ఇక్కడే కొందరు చేతివాటం చూపుతున్నారు. ప్రైవేటు ల్యాబులపై వైద్య ఆరోగ్యశాఖ అధికారుల తనిఖీలు అంతంత మాత్రంగా ఉండటంతో అందినకాడికి రోగులను దోచేస్తున్నారు.

- తిరుపతి (వైద్యం)

తిరుపతి నగరంతోపాటు శ్రీకాళహస్తి, నాయుడుపేట, సూళ్లూరుపేట, గూడూరు, వరదయ్యపాళెం, సత్యవేడు, పుత్తూరు, నగరి తదితర ప్రాంతాల్లో 50 శాతానికిపైగా ప్రైవేటు ల్యాబులు వైద్యఆరోగ్యశాఖ అధికారుల అనుమతులు లేకుండానే నడుస్తున్నాయి. మారుమూల ప్రాంతాల్లో అయితే ఏకంగా మందుల దుకాణాల్లోనూ నిబంధనలు పాటించకుండా ప్రైవేటు ల్యాబులు ఏర్పాటు చేసున్నారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 140 ప్రైవేటు ల్యాబులు ఉన్నాయని అధికారుల లెక్కల చెబుతున్నా.. అనధికారికంగా మరో 150 పైగానే ఉన్నాయి. వీటిల్లో పనిచేసే టెక్నీషియన్లు పారామెడికల్ బోర్డు రిజిస్ట్రేషన్ ఐదేళ్లకోసారి చేయించుకోవాల్సి ఉన్నా అదీ జరగడం లేదు. దీనికితోడు అర్హత లేని సిబ్బంది విధులు నిర్వహిస్తూ రోగుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు.

తనిఖీలు లేకపోవడం వల్లేనా?

గత ప్రభుత్వ హయాంలో ఎలాంటి అర్హత, అనుభవం, అనుమతి లేకపోయినా కేవలం పాలకుల అండదండలతో పుట్టగొడుగుల్లా ప్రైవేటు ల్యాబులు పుట్టుకొచ్చాయి. వీటిపై వైద్యఆరోగ్యశాఖ అధికారులు తనిఖీ చేయడానికి వెళితే అప్పటి అధికారపార్టీ నేతల నుంచి ఒత్తిళ్లు రావడంతో క్రమక్రమంగా ప్రైవేటు ల్యాబుల జోలికి అధికారులు వెళ్లడం మానేశారు. ప్రస్తుతం కూడా తనిఖీలు చేయడం లేదన్న విమర్శలొస్తున్నాయి.

అర్హత లేని వారే ఉద్యోగులు

ప్రైవేటు ల్యాబుల్లో చాలాచోట్ల అర్హతలేని వారే ఉద్యోగులుగా ఉన్నారు. అరకొరగా అవగాహన కల్పించి, తక్కువ వేతనాలతో కానిచ్చేస్తూ.. రోగుల ప్రాణాలను పణంగా పెడుతున్నారు. ప్రధానంగా అత్యవసర పరిస్థితుల్లో చికిత్స పొందుతున్న వారికి సరైన వ్యాధి నిర్ధారణ జరగ్గ తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

ఇష్టానుసారంగా ధరలు

ప్రతీ ప్రైవేటు ల్యాబులోనూ చేసే పరీక్షలు.. వాటికి సంబంధించిన ధరలను వివరిస్తూ బోర్డులు ఏర్పాటు చేయాలి. కానీ ఎక్కడా ఇవి కానరావు. వారు చెప్పిందే ధరగా నిర్ణయించి రోగుల నుంచి అందినకాడికి దోచుకుంటున్నారు. హెచ్‌బీ పరీక్షకు రూ.300 అయితే.. రూ.550-700 వరకు తీసుకుంటున్నారు. సీబీపీకి రూ.200లైతే రూ.400-600, మలేరియా, టైఫాయిడ్, వైడల్ పరీక్షలకు రూ.200లైతే రూ.400-800, డెంగ్యూ పరీక్షకు రూ.500 లైతే రూ.800-1200 వరకు వసూలు చేస్తున్నారు. లిపిడ్ ప్రొఫైల్, థైరాయిడ్, సీబీపీ పరీక్షలకు రూ.300లైతే రూ.600లకుపైగా తీసుకుంటున్నారు. స్క్రీనింగ్ పరీక్షకు రూ.700లకుగాను రూ.వెయ్యికిపైగా వసూలు చేస్తున్నారు.

నిబంధనలు పాటించకుంటే సీజ్ చేస్తాం

అనుమతులు, నిబంధనలు పాటించని ప్రైవేటు ల్యాబులను సీజ్ చేస్తాం. ఫిర్యాదులు వస్తున్న ల్యాబులపై తనిఖీ చేసి చర్యలు తీసుకుంటున్నాం. ఎక్కడైనా ఇంకా నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేటు ల్యాబులు నిర్వహించినా, రోగుల నుంచి అధిక ధరలు వసూలు చేసినా ఫిర్యాదు చేస్తే పూర్తిగా అరికడతాం.

- డాక్టర్ శ్రీహరి, వైద్యఆరోగ్యశాఖాధికారి



మీరేం చేస్తున్నారు?

- తిరుచానూరు పెద్ద చెరువుకు గండి ఘటనలో అధికారులపై కలెక్టర్ ఆగ్రహం


తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు 1: తిరుచానూరు పెద్ద చెరువుకు బుధవారం గుర్తు తెలియని వ్యక్తులు గండి కొట్టడంతో అందులోని నీరు వీవీనగర్, పలు కాలనీలను ముంచెత్తింది. దీంతో స్థానికులు తీవ్ర అవస్థ పడిన విషయం తెలిసిందే. 'తిరుచానూరు పెద్ద చెరువుకు గండి' శీర్షికన గురువారం ఆంధ్రజ్యోతిలో కథనం కూడా ప్రచురితమైంది. దీనిపై కలెక్టర్ వెంకటేశ్వర్ సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. 'అసలు చెరువుకు గండి కొట్టే ధైర్యం ఎవరికి వచ్చింది.. వర్షాలు లేవు కాబట్టి సరిపోయింది.. అసలు మీరేం చేస్తున్నారు' అంటూ మండిపడ్డారు. చెరువు ఎంతమేరకు ఆక్రమణకు గురైంది.. సప్లయ్ చానళ్ల పరిస్థితిపై విచారించి, నివేదిక అందజేయాలని ఆదేశించారు.

చెరువు స్థలాన్ని కాపాడాలంటున్న స్థానికులు

వైసీపీ ప్రభుత్వం హయాంలో పర్యాటక అభివృద్ధి పేరుతో చెరువులోని 17ఎకరాలను తుడాకు కేటాయించారు. అయితే ఈ భూమిని ఓ ప్రైవేటు సంస్థకు తుడా లీజుకిచ్చేసింది. అప్పటినుంచి చెరువు ఆనవాళ్లు కోల్పోవడం మొదలైంది. ప్రధానంగా నీరున్న ప్రాంతంలోనూ చాలా భాగాన్ని చదును చేసేవారు.ఇక మాస్టర్‌ప్లాన్ రోడ్డు నిర్మాణంలో భాగంగా పద్మావతిపురంలో కొంతమంది ఇళ్లు కోల్పోయారు.ఆ నిరాశ్రయుల ముసుగులోవారికి కొంతభాగం ఇచ్చి..75శాతం వైసీపీ నేతలే కబ్జా చేసి (పద్మావతిపురం శ్మశానం సమీపంలో) షాపింగ్ కాంప్లెక్సు, ఇళ్లు నిర్మించారు. కూటమి ప్రభుత్వం వచ్చినా పనులు ఆగడం లేదు. దీనిపై కలెక్టర్ ఆరా తీసి.. చెరువు స్థలాన్ని పరిరక్షించాలని స్థానికులు కోరుతున్నారు.

శ్రీవారి పుష్కరిణికి మరమ్మతులు ప్రారంభం

తిరుమల, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి పుష్కరిణి మరమ్మతు పనులు గురువారం నుంచి మొదలయ్యాయి. సాధారణంగా ప్రతి ఏడాది బ్రహ్మోత్సవాలకు ముందు పుష్కరిణిలోని మరమ్మతులను పూర్తి చేసి నీటిని నింపడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా గురువారం నుంచి ఈనెల 31వ తేదీ వరకు పుష్కరిణిని మూసివేసి మరమ్మతులు చేయాలని టీటీడీ నిర్ణయించింది. ఈక్రమంలో గురువారం భక్తుల అనుమతిని రద్దు చేసి ప్రస్తుతం ఉన్న నీటిని తోడే పనులను మొదలుపెట్టారు. తొలి పదిరోజులు నీటిని తొలగిస్తారు. తర్వాత పదిరోజులు మరమ్మతులేవైనా ఉంటే గుర్తించి పూర్తి చేస్తారు. చివరి పదిరోజుల్లో తిరిగి నీటిని నింపుతారు. సెప్టెంబరు ఒకటో తేదీ నుంచి పుష్కరిణిని భక్తులకు అందుబాటులోకి తీసుకొస్తారు. కాగా, ప్రస్తుతం భక్తులకు ఇబ్బంది లేకుండా పుష్కరిణి వెనుకభాగంలో ప్రత్యామ్నాయంగా నీటి కొళాయిలను ఏర్పాటు చేశారు. భక్తుల అనుమతిని రద్దు చేయడంతో నిత్యం కిటకిటలాడే పుష్కరిణి బోసిపోయింది.



భక్తుల్లేక బోసిపోయిన పుష్కరిణి

ముక్కంటికే పంగనామమా?

- ఒప్పంద ఉద్యోగికి రహస్యంగా జీతం ఫైల్ పంపడంపై అభ్యంతరాలు

శ్రీకాళహస్తి, ఆగస్టు 1: ముక్కంటి ఆలయంలో ఓ ఒప్పంద ఉద్యోగికి రహస్యంగా 18 నెలల కాలానికి జీతం కోసం ఫైల్ పంపడంపై సర్వత్రా అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ఆలయంలో ఓ ఒప్పంద ఉద్యోగి అటెండర్‌గా విధులు నిర్వహించేవాడు. వైసీపీ నాయకులతో సన్నిహిత సంబంధాలు ఉండటంతో పీఆర్వోగా మారి.. అక్రమార్జన చేయడంతోపాటు అజమాయిషీ చెలాయించాడు. పీఆర్వో కార్యాలయంలో పలుమార్లు నిర్లక్ష్యంగా విధులు నిర్వహించాడు. 18 నెలల కిందట ఆయన్ను దుకాణాలు అద్దె వసూలు చేసే విభాగానికి అంతర్గతంగా అధికారులు బదిలీ చేశారు. రాజకీయ అండ ఉన్న తననే బదిలీ చేస్తారా? అంటూ ఎలాంటి ముందస్తు అనుమతి లేకుండా అనధికారికంగా విధులకు గైర్హాజరయ్యారు. దాంతో క్రమశిక్షణ చర్యలు కింద ఆ ఒప్పంద ఉద్యోగిని విధులనుంచి పక్కన పెట్టారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఆ ఉద్యోగి.. ముక్కంటి ఆలయ పాలకమండలి, కొందరు వైసీపీ నాయకులకు ముడుపులు చెల్లించి తిరిగి విధుల్లో చేరేందుకు ప్రయత్నాలు సాగించాడు. విధుల్లో చేరకుండానే పాలకమండలి నాయకులతో కలిసి ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చే వారం ముందు ప్రారంభోత్సవ వేడుకల్లో హల్‌చల్ చేశాడు. దీనిపై అప్పట్లోనే విధుల్లో లేకుండానే వైసీపీ అండతో ఈ ఉద్యోగి వ్యవహారంపై 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది. ఆ వెంటనే ఎన్నికల కోడ్ వెలువడింది. దాంతో ఒప్పంద ఉద్యోగి విధుల్లో చేరే అంశం బ్రేక్‌పడింది. అప్పటినుంచి దూరంగా ఉన్న ఆయన కొద్దిరోజులుగా ఆలయంలోని ఓ కీలక అధికారితో మంతనాలు సాగించాడు. ఆ అధికారి ఇతడిని విధుల్లోకి తీసుకోవడంతోపాటు 18 నెలలు గైర్హాజరు అయిన కాలానికి జీతం మంజూరు చేసేలా దేవదాయశాఖకు గురువారం ప్రతిపాదనలు పంపాడు. ఈ విషయం బయటకు రావడంతో కీలక అధికారి తీరుపై ఆలయంలోని ఉద్యోగ వర్గాల్లోనే అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి.



తొలిరోజే 97.6 శాతం పింఛన్ల పంపిణీ



తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు 1: ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పింఛన్లను జిల్లాలో తొలి రోజే 97.6 శాతం పంపిణీ చేశారు. గురువారం ఉదయం ఆరు గంటల నుంచే సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు నగదు అందించారు. 691 సచివాలయ పరిధిలో వితంతువులు, వృద్ధులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు ఇలా మొత్తం 2,67,772మంది లబ్ధిదారులు ఉండగా, 2,61,300 మందికి పింఛన్లు అందాయి. మిగిలిన వారిలో కొందరికి సాంకేతిక సమస్య తలెత్తగా, ఇంకొందరు వేరే ఊర్లకు వెళ్లి ఉన్నారు. ఇటువంటివారికి శుక్రవారం పంపిణీ చేస్తారు. ఇక కలెక్టర్ వెంకటేశ్వర్ పంపిణీ ప్రక్రియను పలుచోట్ల తనిఖీ చేశారు. ఏర్పేడు మండలం ఆమందూరు గ్రామ పంచాయతీలో అయితే కలెక్టర్ స్వయంగా లబ్ధిదారుకు పింఛను నగదు అందజేశారు. అలాగే రేణిగుంట మండలం జీపాళెంకు చెందిన దొరస్వామిరెడ్డి స్విమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండటంతో సచివాలయ సిబ్బంది వెళ్లి పింఛను నగదు అందజేశారు. ఇలాగే పలు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న రోగులకూ పంపిణీ చేశారు. పింఛన్ల పంపిణీలో పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

స్విమ్స్‌లో చికిత్స పొందుతున్న దొరస్వామిరెడ్డికి పింఛను అందజేస్తున్న సచివాలయ సిబ్బంది

15 నాటికి అన్న క్యాంటీన్ ప్రారంభం : కలెక్టర్

వెంకటగిరి, ఆగస్టు 1: రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 15వ తేది నాటికి అన్న క్యాంటీన్లను ప్రారంభించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. గురువారం వెంకటగిరికి విచ్చేసిన ఆయన ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణతో కలిసి అన్న క్యాంటీన్ పనులకు పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. అనంతరం విశ్వోదయ క్రీడా ప్రాంగణంలో వివాదాస్పదంగా ఉన్న స్థలాలను పరిశీలించడంతోపాటు పాపమాంబాపురంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులకు పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీపీ తనూజా, టీడీపీ నాయకులు మదునాయుడు, పప్పు చంద్రమౌళిరెడ్డి, పోలంరెడ్డి కోటేశ్వర్రెడ్డి, జీకేపల్లి బాబు నాయుడు, రాహూరు శ్రీనివాసులు, కొల్లాహూరు సుధ, చెంగారావు, మగ్గం వెంకటాచలం తదితరులు ఉన్నారు.

ఆళ్వారు విగ్రహాల తొలగింపు

గూడూరు, ఆగస్టు 1: స్థానిక అళగనాథస్వామి ఆలయంలో గురువారం ఆళ్వార్ల విగ్రహాలను వివిధశాఖల అధికారుల పర్యవేక్షణలో తొలగించారు. ఈ ఆలయంలో 1952లో దాతల సహకారంతో ఆళ్వార్ల మండపం, స్వామి వారి ఉత్సవాలకు వినియోగించే వివిధ వాహనాల గదిని నిర్మించారు. ఆళ్వార్ల మండపం శిథిలావస్థకు చేరుకోవడంతో దేవదాయశాఖ, మున్సిపల్ శాఖ, పోలీస్‌శాఖ, స్థానికుల సమక్షంలో ఆళ్వార్ల విగ్రహాలను తొలగించి ఆలయంలో భద్రపరిచారు. శిథిలావస్థకు చేరిన మండపాన్ని తొలగించి దాతల సహకారంతో పునఃనిర్మించేందుకు చర్యలు చేపడుతున్నట్లు దేవదాయశాఖ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస బాబు, ఈవో శశాంక్, మున్సిపల్ ఆర్ఐ ప్రకాష్ పాల్గొన్నారు.

తిరుమల బస్సు సర్వీసులను పునరుద్ధరించాలి

గూడూరు, ఆగస్టు 1: గూడూరు నుంచి తిరుమలకు ఆర్టీసీ బస్సు సర్వీసులను పునరుద్ధరించాలని బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి మనోజ్‌కుమార్ అన్నారు. గురువారం స్థానిక ఆర్టీసీ డిపోలో డీఎం వెంకటేశ్వర్లుకు బీజేవైఎం నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొవిడ్‌కు ముందు గూడూరు రైల్వేస్టేషన్ నుంచి తిరుమలకు 5 బస్సు సర్వీసులు నడిపేవారన్నారు. శ్రీవారి భక్తులకు సౌకర్యవంతంగా తిరుమల బస్సులు ఉండేవన్నారు. అధికారులు స్పందించి తిరుమలకు బస్సులను పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో శివశంకర్, కిరణ్, మహేష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీలో వైసీపీ నేత అక్రమాలు



అక్రమ కట్టడం గోదాము వద్ద నిరసన తెలుపుతున్న టీడీపీ నాయకులు

వాకాడు, ఆగస్టు 1 : రావిగుంట పాళెంలోని జగనన్న కాలనీలో గిరిజన కుటుంబానికి చెందిన మాణికల రామయ్యకి ఇచ్చిన స్థలంలో వైసీపీ కీలకనేత గోదాము నిర్మాణాన్ని చేపట్టడంతో టీడీపీ నేతలు గురువారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు ఇంగిలాల బుజగేంద్ర మాట్లాడుతూ మాణికల రామయ్యకు నిర్దేశించిన స్థలంలో వైసీపీ నేత గోదాము నిర్మాణాన్ని చేపట్టాడని తెలిపారు. రామయ్య ఇంటి నిర్మాణానికి అప్పటి ప్రభుత్వం ఇచ్చిన రూ 1.80 లక్షలు వైసీపీ నేతే తీసుకొని తన సొంత గోదాము నిర్మాణాన్ని హౌసింగ్, రెవెన్యూ అధికారుల సహకారంతో నిర్మించుకున్నాడని తెలిపారు. లబ్ధిదారుడు రామయ్య నేటికి గుడిసెలోనే జీవనం సాగిస్తున్నాడని, అధికారుల వైసీపీ నేత అక్రమాలపై చర్యలు చేపట్టి మాణికల రామయ్యకి పక్కాగృహాన్ని ఇవ్వాలన్నారు. శాలివాహన డైరెక్టర్ కోట శ్రీనివాసులు, వాకాటి విజయభాస్కర్‌రెడ్డి, జమీందర్ పాల్గొన్నారు.

తల్లిపాలే బిడ్డకు సంజీవని

పెళ్లకూరు, ఆగస్టు 1 : తల్లిపాలే బిడ్డకు సంజీవని, మానసిక, శారీరక ఎదుగుదలకు దోహదపడతాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సాయిలక్ష్మి తెలిపారు. మండలంలోని తాళ్వాయిపాడు అంగన్‌కేంద్రంలో గురువారం నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. బిడ్డ పుట్టిన గంటలోపే ప్రతి తల్లి పాలు ఇవ్వాలని, దీంతో శిశువు ఆరోగ్యంగా పెరగడానికి ఎంతగానో దోహదపడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ శ్రావణి, ఏఎస్‌కే ప్రవళ్లిక, అంగన్‌వాడీ కార్యకర్తలు స్వరూపరాణి, ఆదెమ్మ, ఉషా తదితరులు పాల్గొన్నారు.

మాతాశిశు మరణాల నివారణకు కృషి చేయాలి

గూడూరు అర్బన్, ఆగస్టు 1: మాతాశిశు మరణాల నివారణకు వైద్యులు, వైద్యసిబ్బంది కృషి చేయాలని జిల్లా టాస్క్‌ఫోర్స్ ప్రధాన అధికారి డాక్టర్ శ్రీనివాసరావు అన్నారు. గురువారం స్థానిక బనిగీసాహెబ్‌పేటలోని అర్బన్ హెల్త్‌సెంటర్‌ను పరిశీలించి వైద్యసిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ చిన్నారులు, గర్భిణులు, బాలింతలు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవడం ద్వారా రక్తహీనతను నివారించవచ్చునన్నారు. కార్యక్రమంలో నాగేంద్రకుమార్, బేబిరాణి, ప్రకాష్, డాక్టర్ సల్మా, శకుంతలమ్మ, విక్టోరియా, పర్వీన్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం సభ్యులపై ఆరోపణలు తగవు

గూడూరు అర్బన్, ఆగస్టు 1: సీపీఎం సభ్యులపై కొందరు చేస్తున్న ఆరోపణలను ఖండిస్తున్నామని ఆ పార్టీ నాయకుడు శివకుమార్ అన్నారు. గురువారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ జక్కా వెంకయ్య శ్రామికనగర్‌లో డ్రైనేజీకాలువ సమస్యను పరిష్కరించాలని సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కాలనీ నుంచి నీరు వెళ్లేందుకు వీలు లేకుండా ఓ ప్రైవేటు కళాశాల యాజమాన్యం అడ్డుగా గోడ నిర్మించడమేకాకుండా, పేదల పక్షాన సమస్య పరిష్కారానికి పోరాటం చేస్తున్న సీపీఎం సభ్యులపై ఆరోపణలు చేయడం మంచి పద్ధతి కాదన్నారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, శంకరయ్య, బీవీరమణయ్య, సురేష్, మణి, ప్రసాద్, ముత్యాలయ్య, చంద్రయ్య పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చొరవతో మాబాకకు ఆర్టీసీ బస్సు

నాయుడుపేట టౌన్, ఆగస్టు1: సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ చొరవతో మాబాక గ్రామానికి ఆర్టీసీ బస్సును ఏర్పాటు చేశారు. గురువారం గ్రామానికి చేరుకున్న ఆర్టీసీ బస్సు వద్ద టీడీపీ నాయకులు గుండ్లూరు దయాకర్‌నాయుడు గ్రామస్థులతో కలసి ఆర్టీసీ సిబ్బందికి మిఠాయిలను అందజేశారు. దయాకర్‌నాయుడు మాట్లాడుతూ శ్రీకాళహస్తి నుంచి మాబాక మీదుగా ఆర్టీసీ బస్సు నాయుడుపేటకు చేరుకుంటుందని, దీంతో మాబాక గ్రామస్థులకు సౌకర్యంగా ఉంటుందని తెలిపారు. మాబాక గ్రామస్థులు వెంకటేశ్వర్లుగౌడ్, ప్రసాద్‌నాయుడు, బాబునాయుడు, వినోద్, సాయి, అశోక్, చాందు, వెంకటయ్య, సిద్ధయ్య పాల్గొన్నారు.

హోటళ్లపై ఫుడ్ ఇన్‌స్పెక్టర్ దాడులు



సూళ్లూరుపేట, ఆగస్టు 1: పట్టణంలో హోటళ్లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, స్వీట్లు తయారు చేసే దుకాణాలపై గురువారం జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ఎన్.మద్దులేటి మున్సిపల్ కమిషనర్ గంగా ప్రసాద్‌తో కలిసి దాడులు చేశారు. హైవేపై కోటపోలూరు క్రాస్ వద్దనున్న దాబా, పక్కనే ఉన్న మరో హోటల్‌లో వండిన వంటలు, ఆహార పదార్థాలు తనిఖీ చేసి నిల్వచేసిన ఆహార పదార్థాలను వినియోగిస్తే చర్యలు తీసుకొంటామన్నారు. అనంతరం పట్టణంలో స్వీట్లు, తినుబండరాలు తయారు చేసే దుకాణాలతోపాటు పలు హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లను తనిఖీ చేసి వారి వద్దనున్న ఆహార పదార్థాలు, వాటిని వినియోగించే ఆయిల్, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబంధనలు పాటించాలని, నిల్వచేసిన ఆహార పదార్థాలను వినియోగిస్తే చర్యలు తీసుకొంటామన్నారు.

పేదలకు అన్నదానం



నాయుడుపేట టౌన్, ఆగస్టు 1 : టీడీపీ సీనియర్ నేత, మాజీ ఎంపీపీ, ఆర్య వైశ్య సంఘం నాయకుడు పెసల జయప్రకాష్‌గుప్త సేవలు చిరస్మరణీయమని నెల్లూరు జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కనమర్లపూడి సుబ్రమణి అన్నారు. జయప్రకాష్‌గుప్త జయంతి సందర్భంగా గురువారం గడియారం సెంటర్ వద్ద ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. మధ్యాహ్నం పేదలకు అన్నదానం చేశారు. సంఘ నాయకులు సోమిశెట్టి వెంక టేశ్వర్లు, పెసల జయరాజ్‌గోపాల్, పెసల కిషోర్‌బాబు, కోటా వెంకటేశ్వర్లు, లక్ష్మీనారాయణ, కృష్ణారావు, పెసల రమేష్‌బాబు, భాస్కర్, బలరామ్ ఉన్నారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ

తడ,ఆగస్టు1: మండలంలోని కొండూరు పంచాయతీలో రూ.10 లక్షలతో గురువారం సీసీ రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ భూమి పూజ చేశారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడిన 50 రోజులకే రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేయడం తెలుగుదేశం పార్టీకి అభివృద్ధిపై ఉన్న చిత్తశుద్ధిని నిరూపిస్తుందన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు కామిరెడ్డి మురళీరెడ్డి, వేనాటి శ్రీకాంత్‌రెడ్డి, వేనాటి రాజారెడ్డి, రవి, శ్యామసుందర్‌రెడ్డి, వెంకటయ్య పాల్గొన్నారు.

మేరీ వృద్ధాశ్రమానికి చేయూత



నాయుడుపేట, ఆగస్టు 1 : నాయుడుపేటలోని మేరీ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు గురువారం అరబిందో ఉద్యోగి సుదర్శన్‌రెడ్డి ఆయన తల్లి రాజేశ్వరి 4వ వర్థంతి సందర్భంగా దుప్పట్లు పంపిణీ చేశారు. అలాగే మధ్యాహ్నం వృద్ధులకు భోజనాన్ని అందజేశారు. మేరీ వృద్ధాశ్రమం రేకులతో ఉండటంతో శ్లాబుకోసం తన శక్తిమేర చేయూత అందిస్తామన్నారు. ఆశ్రమంలోని వృద్ధులను ఆదరిస్తున్న సునీత బెన్నీలను ప్రత్యేకంగా అభినందించారు.

తాగునీటి పథకం ప్రారంభం

నాయుడుపేట, ఆగస్టు 1 :నాయుడుపేట కొత్త బీడీ కాలనీలో గురువారం రూ.5 లక్షలతో తాగునీటి పథకాన్ని మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం టీడీపీ నాయకులతో కలసి ప్రారంభించారు. ఇటీవల బీడీకాలనీలో తాగునీటి సమస్య తలెత్తడంతో స్థానికులు ఎమ్మెల్యే విజయశ్రీ దృష్టికి తీసుకురావడంతో తక్షణమే బోరు వేసి తాగునీటి ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ జనార్థన్ రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ శిరసనంబేటి విజయభాస్కర్ రెడ్డి, వైస్ చైర్మన్ ఎస్‌కె రఫీ, దేవారెడ్డి నాగేంద్రరెడ్డి, టీడీపీ నాయకులు నెలవల రాజేష్, పసల చెంగయ్య, నానాబాల సుబ్బారావు, బిరదవాడ నారాయణ, రవి, ధనంజయ తదితరులు ఉన్నారు.

క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు



నాయుడుపేట, ఆగస్టు 1 : నాయుడుపేట మండలం పుదూరులో గురువారం తిరుపతి సిమ్స్ వైద్య బృందంచే క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఇటీవల కాలంలో క్యాన్సర్ ప్రబలుతుండటం, వాటిని ప్రజలు గుర్తించలేకపోవడంతో క్యాన్సర్ వ్యాధి తీవ్రత పెరుగుతోందని సిమ్స్ వైద్యాధికారిణి స్రవంతి అన్నారు. సహజంగా 30 సంవత్సరాలు పైబడిన వారికి క్యాన్సర్ వచ్చే అవకాశం ఉంటుందన్నారు. ప్రధానంగా నోరు, రొమ్ముభాగం, గర్భాశయం, టెస్టికల్స్‌లలో క్యాన్సర్ వచ్చే అవకాశం ఉందన్నారు. నేటి ఆహారపు అలవాట్లు ఒ కారణం అవుతుందన్నారు. రోగులను పరీక్షించి ప్రాథమికంగా క్యాన్సర్ లక్షణాలు ఉంటే వారిని తిరుపతి సిమ్స్‌లో క్షుణ్ణంగా పరీక్షలు నిర్వహించి నిర్ధారణ చేస్తామన్నారు. అలాగే బీపీ, షుగర్ పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వికాస్, డాక్టర్ శంకరయ్య, ఎంపీపీ ధనలక్ష్మి, సర్పంచ్ సుమతి తదితరులు ఉన్నారు.

చెంగాళమ్మ ఆలయ ఇన్‌చార్జి ఈవోగా శ్రీనివాస బాబు



సూళ్లూరుపేట, ఆగస్టు 1: సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ ఆలయ ఇన్‌చార్జి ఈవోగా గురువారం శ్రీనివాస బాబు బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న సహాయ కమిషనర్ డబ్బుగుంట వెంకటేశ్వర్లు సస్పెన్షన్‌కు గురైన విషయం తెలిసిందే. దీంతో గూడూరు దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్న శ్రీనివాస్ బాబును చెంగాళమ్మ ఆలయ ఇన్‌చార్జి ఈవోగా అదనపు బాధ్యతలను అప్పగించారు.

ఎస్ఎంసీ ఎన్నికలపై శిక్షణ

దొరవారిసత్రం, ఆగస్టు 1 : ప్రభుత్వ పాఠశాలల ఎస్ఎంసీ కమిటీల ఎన్నికలపై గురువారం ప్రధానోపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. స్థానిక ఏకొల్లు ఉన్నత పాఠశాలలో మండల విద్యాశాఖాధికారులు మునిశేఖర్, క్రిష్ణయ్యలు ప్రధానోపాధ్యాయులకు ఎన్నికల నియమావళిపై అవగాహన కల్పించారు. ఈ నెల 8వ తేది ఎన్నికలు నిర్వహించేలా ఉపాధ్యాయులకు సూచనలు చేశారు.

అంతర్గత ఆడిట్ తనిఖీలు

కోట, ఆగస్టు 1 : కోటలోని వెలుగు కార్యాలయంలో గురువారం అంతర్గత ఆడిట్ జరిగింది. సీసీలు కృష్ణ, శ్రీకాంత్, ప్రసాద్, కృష్ణమ్మ, భాస్కర్, శంకరయ్యల ఆధ్వర్యంలో మండలంలోని 21 పంచాయతీలలో ఉన్న సంఘ బంధాల లావాదేవీలకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. వీవోఏల పర్యవేక్షణలో ఆయా సంఘ బంధాలకు పలు రకాల రుణాలు ఇచ్చారు. రెండు రోజుల్లో ఆయా లావాదేవీలకు సంబంధించి అంతర్గత ఆడిట్ జరుగనున్న నేపథ్యంలో సీసీలు ఆయా రికార్డులను తనిఖీలు చేసి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

తల్లిపాల ప్రాముఖ్యతను తెలుసుకోవాలి

కోట, ఆగస్టు1:తల్లిపాల ప్రాముఖ్యత గురించి తెలుసుకోవాలని సీడీపీవో మునికుమారి కోరారు. పట్టణ పరిధిలోని శ్రీలక్ష్మమ్మ కాలనీలో గల అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం తల్లిపాల వారోత్సవాలు జరిగాయి. వారం రోజులపాటు జరిగే ఈ వారోత్సవాలను సీడీపీవో లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలకు తల్లిపాల విశిష్ఠత గురించి వివరించారు. డబ్బాపాలు వద్దు... ముర్రుపాలే ముద్దు అంటూ తల్లులు, గర్భిణులు నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ కవిత, కృష్ణమ్మ, అంగన్‌వాడీ వర్కర్ పెంచలమ్మ, తదితరులు ఉన్నారు.

తల్లిపాలే బిడ్డకు శ్రేష్టం

డక్కిలి, ఆగస్టు 1 : తల్లిపాలే బిడ్డకు శ్రేష్టమని స్థానిక వైద్యాధికారి శ్రీహరి అన్నారు. గురువారం డక్కిలిలో అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య సిబ్బంది కలిసి తల్లిపాల వారోత్సవాల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముర్రుపాలల్లో రోగనిరోధక శక్తి అధికంగా వుంటుందన్నారు.తల్లిపాల గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు.

ఆల్తూరుపాడు రిజర్వాయరు పరిశీలన

సమస్యను సీఎంకు నివేదించనున్న కలెక్టరు ● నిర్మాణంలో అడ్డంకులు తొలగించేందుకు చర్యలు



ఆగిన రిజర్వాయరు పనులకు పరిశీలిస్తున్న కలెక్టర్

డక్కిలి, ఆగస్టు 1 : డక్కిలి మండలంలో అర్ధాంతరంగా నిలిచిపోయిన ఆల్తూరుపాడు రిజర్వాయర్‌ను గురువారం కలెక్టర్ వెంకటేశ్ తెలుగుగంగ ఇంజనీర్ల బృందంతో కలిసి పర్యవేక్షించారు. రెండు రోజుల క్రితం కలెక్టర్ తన కార్యాలయంలో ఇరిగేషన్ ప్రాజెక్టులపై ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆల్తూరుపాడు రిజర్వాయర్ ఎందుకు ఆగింది అన్న దానిపై చర్చ జరిగింది. ఈ మేరకు ఆయన ఆగిపోయిన ఆల్తూరుపాడు రిజర్వాయర్‌ను గురువారం పరిశీలించడం ప్రాధాన్యతను సంతరించుకొంది. ప్రాజెక్టు నిర్మాణంలో ఎదురైన అడ్డంకులను ఆయన తెలుగుగంగ ఎస్ఈ మదన్‌గోపాల్,ఈఈ రాధాకృష్ణలను అడిగి తెలుసుకున్నారు. సోమశిల-స్వర్ణముఖి బ్యాలెన్ రిజర్వాయర్ నిర్మాణ పనుల్లో భాగంగా 2019లో ఈ ప్రాజెక్టు పనులు ప్రారంభించారని, తర్వాత రీటెండరు పేరుతో 27శాతం లెస్‌తో పనులు దక్కించుకొన్న కాంట్రాక్టరు పనులు పూర్తి చేయకుండా మధ్యలోనే వదిలి పెట్టి వెళ్లినట్లు తెలుగుగంగ అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకు వచ్చారు. అప్పట్లో రిజర్వాయరుకు అవసరమైన 50 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టిని తరలించడం పెద్ద కష్టతరంగా మారడంతోనే కాంట్రాక్టరు పనులు ఆపేయాల్సి వచ్చిందని వివరించారు. రిజర్వాయరు కట్టకు అవసమైన మట్టిని ఈ దఫా ఒకే ప్రాంతం నుంచి కాకుండా డక్కిలి, వెంకటగిరి, బాలాయపల్లి మండలాల్లోని చెరువులను గుర్తించడం జరిగిందని వారు కలెక్టరుకు వివరించారు. అంతే కాకుండా రిజర్వాయర్ లోపల బాగంగలో 29 హెక్టార్లు అటవీ శాఖకు సంబంధించిన భూమి ఉన్నందున రిజర్వాయర్ నిర్మాణంలో కొంత అడ్డంకి ఎదురైందని చెప్పారు. అటవీ అధికారులకు ప్రత్యామ్నాయంగా భూములు కేటాయిస్తామని కలెక్టర్ తెలిపారు. ఈ రిజర్వాయరు నిర్మాణం పూర్తి అయితే వెంకటగిరి, శ్రీకాళహస్తి నియోజకవర్గాల్లో సుమారు 80 వేల ఎకరాల్లో సాగు భూములకు సాగునీరు అందుతుందని కలెక్టర్ చెప్పారు. అంతే కాదు. ఏర్పేడు మండలం మేదర్లపాడు వరకు 70 శాతం పనులు పూర్తి కావస్తున్నాయని చెప్పారు. అక్కడి నుంచి మల్లెమడుగు రిజర్వాయరులోకి పంప్ చేసి అక్కడి నుంచి పైపులైన్ల ద్వారా తిరుపతి నగర ప్రజలకు దాహార్తి కోసం ఈ నీటిని వినియోగిస్తామన్నారు. ఈ ప్రాజెక్టు పూర్తి అయితే 1.50 లక్ష మంది ప్రజలకు తాగునీరు అందుతుందన్నారు. ఇంతటి ప్రాధ్యానతగల ఈ ప్రాజెక్టు సంబంధించి పూర్తి స్థాయి నివేదనకు ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి త్వరలో ఈ ప్రాజెక్టు పనులు మొదలు పెట్టే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ స్పష్టం చేశారు. కాగా ఆల్తూరుపాడు రిజర్వాయరు సందర్శనకు వచ్చిన కలెక్టర్ వెంకటేశ్‌ను ఆల్తూరుపాడు వెల్లంపల్లి గ్రామ రైతులు కలిశారు. తాము గత 30 ఏళ్ళుగా సాగు చేసుకొంటున్న భూములు రిజార్వయర్‌లో పోవడంతో తాము జీవనోపాధి కోల్పోయామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తమ భూములకు పట్టాలు లేనందున తమకు నష్టపరిహారం కూడా ఇవ్వలేదని వారు వాపోయారు. తమకు నష్టపరిహారం ఇప్పించాలని వారు కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. స్పందించిన కలెక్టరు భూములు కోల్పోయిన రైతులకు న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు.

ఇంటిని మరిపించేలా భోజనం ఉండాలి

● కలెక్టర్ వెంకటేశ్వర్

వెంకటగిరిటౌన్, ఆగస్టు1: పాఠశాలల్లో విద్యార్థులకు పెట్టే అన్నం ఇంటిని మరిపించేలా ఉండాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. గురువారం స్థానిక బాలికోన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ సాంబారన్నంలో ఉప్పు ఎక్కువగా ఉందని, అనం కూడా కాస్త ఉడికించాలన్నారు. పుస్తకాలు, యూనిఫాం, షూ అందాయా అని ఎంఈవో, ప్రధానోపాధ్యాయురాలిని అడిగి తెలుసుకున్నారు. ఈ పాఠశాలలో భోజనం కన్నా, భోధన బాగా ఉందన్నారు. పదోతరగతి విద్యార్థులు నూరుశాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం మొక్కలు నాటారు. ఎంఈవో వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అనంతరం ఆయన కలవలపూడి, పాపమాంబపురంలో జరుగుతున్న అమృత సరోవర్ ఉపాధి పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతిఒక్కరికి ఉపాధిపని కల్పించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అమృత సరోవర్ పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్, ప్రేమ్‌కుమార్, దీప తదితరులు పాల్గొన్నారు.



మధ్యాహ్నం భోజనం పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

సంక్షేమ పథకాలు ఒక్కటి కూడా ఆగవు : నెలవల





పెన్షన్‌ను అందజేస్తున్న మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, సూళ్లూరుపేట ఎమ్మెల్యే విజయశ్రీ

పెళ్లకూరు, ఆగస్టు 1 : ఎన్నికల సమయంలో టీడీపీ ప్రజలకు ఇచ్చిన హామీలలో భాగమైన సూపర్ సిక్స్‌లోని సంక్షేమ పథకాలన్నింటినీ ముఖ్యమంత్రి చంద్రబాబు కచ్చితంగా అమలు చేస్తారని మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. గురువారం తాళ్వాయిపాడులో జరిగిన సామాజిక పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పేదల కోసం సంక్షేమ పథకాలను తీసుకొచ్చింది తెలుగుదేశం పార్టీయేనని అన్నారు. ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు వైసీపీ నాయకులు ఎన్నో కుయుక్తులను పన్నుతున్నారని ఆరోపించారు. ఒక్క సూళ్లూరుపేట నియోజకవర్గంలోనే 39332 మందికి రూ.16,85,79,000 పెన్షన్ నగదును అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి, దేవారెడ్డి నాగేంద్ర ప్రసాద్‌రెడ్డి, నాయుడుపేట ఏఎంసీ మాజీ చైర్మన్ శిరసనంబేటి విజయభాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాయుడుపేట టౌన్ : పట్టణంలోని జైహింద్ కాలనీలో గురువారం ఉదయం జరిగిన పింఛన్ల పంపిణీలో టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. ఆయన వెంట కమిషనర్ జనార్థన్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ రఫీ తదితరులు ఉన్నారు.

ఓజిలి : ఓజిలి మండలంలోని 5609 మందికి వివిధ పింఛన్ల కింద 2.37 కోట్ల రూపాయలు పంపిణీ చేసినట్లు ఎంపీడీవో శ్రీనివాసులు తెలిపారు. ఆయా గ్రామాల్లోని సచివాలయ సిబ్బందితోపాటు ఇతర శాఖల అధికారులు కూడా ఈ పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. మండలంలోని పున్నేపల్లిలో మండల టీడీపీ కన్వీనరు గుజ్జలపూడి విజయకుమార్‌నాయుడు, పంచాయతీ కార్యదర్శులతో కలిసి పింఛన్లు అందజేశారు.

దొరవారిసత్రం : మండలంలోని తల్లంపాడు, అక్కరపాక గ్రామాల్లో సచివాలయ సిబ్బందితో కలసి ఎమ్మెల్యే విజయశ్రీ లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. ఆమె వెంట మండల టీడీపీ అధ్యక్షుడు శ్రీనివాసులునాయుడు, అధికారులు ఉన్నారు. మండలంలో గురువారం 97.73శాతం పింఛన్లు పంపిణీ చేశారు.

సూళ్లూరుపేట: టీడీపీ నాయకులతో కలిసి ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ పట్టణంలోని సాయి వృద్ధాశ్రమంలో ఉన్న వృద్ధులకు పింఛన్లతోపాటు దాతల సాయంతో చీరలు, పండ్లు అందజేశారు. అనంతరం కుదిరి, కేసియన్ గుంట గ్రామాల్లో పింఛన్లు అందజేశారు.

తడ : కొండూరు, చేనిగుంట పంచాయతీలలో ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ పాల్గొని పింఛన్లను పంపిణీ చేశారు. ఇంచుమించుగా పింఛన్ల పంపిణీ పూర్తి అయిందని, మిగిలిన కొద్ది మందికి శుక్రవారం ఉదయంకల్లా పంపిణీ చేస్తామని ఎంపీడీవో విజయకుమార్ తెలిపారు.

ఇచ్చిన హామీని నిలబెట్టుకున్న ఘనత చంద్రబాబుదే





పింఛన్లను అందజేస్తున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

గూడూరు, ఆగస్టు 1: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకుని అధికారంలోకి రాగానే పింఛన్లను రూ. 4 వేలకు పెంచి పంపిణీ చేసిన ఘనత సీఎం చంద్రబాబుకే దక్కుతుందని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. గురువారం పట్టణంలో ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పెన్షన్ల పంపిణీలో ఆయన మాట్లాడుతూ దేశంలోనే నెలకు రూ. 4 వేలు పెన్షన్ అందజేసే రాష్ట్రం మన రాష్ట్రమేనన్నారు. త్వరలోనే సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేస్తారన్నారు. కార్యక్రమంలో రవీంద్రరెడ్డి, మునిగిరీష్, జహంగీర్, గోపాల్‌రావు, శివకుమార్, అమరయ్య, ప్రవీణ్, సునీల్, తూపిలి సురేంద్ర, సుమన్, ఉమాశంకర్, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, కొమ్మా రవి, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా వాలాయనందపురం గిరిజనకాలనీలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి శీలం కిరణ్‌కుమార్, 33వ వార్డులో టీడీపీ మైనార్టీ సెల్‌నాయకుడు అబ్దుల్ రహీం, చెన్నూరులో తెలుగు మహిళ నాయకురాలు మట్టం శ్రావణి పెన్షన్‌లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు.

వెంకటగిరి : అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్ అందించడమే ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. గురువారం పట్టణంలోని 22వ వార్డు, 25వ వార్డుల్లో ఆయన లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు గంగోటి నాగేశ్వరావు, పునుగోటి సుబ్రమణ్యం నాయుడు, చంద్రా, పులికొల్లు రాజేశ్వరావు, బీరం రాజేశ్వరావు, పునుగోటి విశ్వనాదనాయుడు, శ్రీరామదాసు గంగాదర్, కాపా శ్రీనివాసుల నాయుడు, సామల చెలపతి, జానపాటి మురళీ, మంకు ఆనంద్ ఉన్నారు.

ఎస్సీ వర్గీకరణపై ఎమ్మార్పీఎస్ సంబరాలు



అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

నాయుడుపేట టౌన్, ఆగస్టు 1: ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు మేరకు పాత బస్టాండ్ సమీపంలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్ నాయకులు సంబరాలు జరుపుకొన్నారు. గురువారం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నియోజకవర్గ సుప్రీంకోర్టు ఇన్‌చార్జి రవి, నాయకులు వాసు, శ్రీనివాసులు, శివ, రవి, హజరత్, శ్రీనివాసులు, వీరరాఘవులు, చంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై సానుకూల స్పందనతో హర్షం

చిల్లకూరు : ఎస్సీ వర్గీకరణ చేసే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు ఉందని సుప్రీంకోర్టు స్పష్టం చేయడం హర్షనీయమని సీమాంధ్ర ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు చీమల శ్రీనివాసులు పేర్కొన్నారు. ఎన్నో ఏళ్లుగా ఎస్సీ వర్గీకరణ కోసం పోరాటాలు సాగిస్తున్నామని, సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామన్నారు. రాష్ట్రప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ చేపట్టి మాదిగలకు న్యాయం చేయాలని కోరుతున్నామన్నారు.

సుప్రీంకోర్టు తీర్పు హర్షనీయం

కోట : ఎస్సీ వర్గీకరణ కోసం సుదీర్ఘ పోరాటంలో మాదిగలు సుప్రీంకోర్టు ఆదేశాలతో ఒక మెట్టు ఎక్కినట్లు అయ్యిందని సమైక్యాంధ్ర ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఆత్మకూరు నాగేంద్ర అన్నారు. అనంతరం శ్యామసుందరపురంలో బాణాసంచా పేల్చి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో కాటేపల్లి వెంకటేశ్వర్లు, యల్లశిరి మాతయ్య, పట్టపు పెంచలయ్య, మాతయ్య, చెరుకూరి రామకృష్ణ, తదితరులు ఉన్నారు.